ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పల్నాడు జిల్లా వార్తలు



గురువారం 29 ఫిబ్రవరి 2024



తెరపైకి పాత బ్రాండ్లు?



- కొన్ని రోజులుగా హడావుడి
- దుకాణాల్లో మాత్రం పిచ్చి బ్రాండ్లే
- మందుబాబులను ఆకర్షించడానికేనని విమర్శలు
- దుకాణాలకు చేరకుండానే పాత బ్రాండ్లు మాయం

గుంటూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పిచ్చి బ్రాండ్లతో విసిగిపోయిన మందుబాబులను ఆకట్టుకునేందుకు.. ప్రభుత్వ మద్యం దుకాణాలకు వారిని తిరిగి రాబట్టుకునేందుకు పాత బ్రాండ్ల పేరుతో కొన్ని రోజులుగా రాష్ట్ర ప్రభుత్వం, ఎక్సైజ్ శాఖ హడావుడి మొదలు పెట్టాయి. ఎన్నికలకు మరో రెండు నెలల సమయం ఉందనగా పాత బ్రాండ్లను అందుబాటులోకి తెస్తున్నట్లు ప్రకటనలు, ప్రచారాలు ఊపందుకుంటున్నాయి.నాలుగున్నరేళ్లకు పైగా పాత బ్రాండ్ల ఊసెత్తని ప్రభుత్వం ఉన్నట్లుండి పాత బ్రాండ్లతో హడావుడి చేయడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మద్యం బ్రాండ్ల పేరుతో ప్రభుత్వం చేస్తున్న హడావుడి మందుబాబుల కోసమా? వచ్చే ఎన్నికల కోసమా? అనేది ఇప్పుడు తేలాల్సిన ప్రశ్న. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో కొత్త బ్రాండ్లు నాసిరకంగా ఉండడంతో మందు బాబులు ముఖం చాటేస్తున్నారు. దీంతో పాత బ్రాండ్లను తెస్తామని ప్రభుత్వం కొన్ని రోజులుగా హడావుడి మొదలు పెట్టింది. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో మూడు లిక్కర్ డిపోలు ఉండగా వాటి పరిధిలోని అన్ని ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పాత బ్రాండ్లు అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. వాటితోపాటు బాపట్ల జిల్లా పరిధిలోని చీరాల డివిజన్లోని షాపుల్లో కూడా పాత బ్రాండ్లు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. నికోల్స్ బ్లాక్, నికోల్స్ గోల్డ్ ప్రీమియం బ్రాందీ, 100 పైపర్స్ విస్కీ, బ్లెండర్స్ ప్రైడ్ విస్కీ, రాయల్ స్టాగ్ విస్కీ, బాల్లెంటైన్స్ ఫైనెస్ట్ విస్కీ, ప్లాటినమ్ సుపీరియర్ వైట్ రమ్ము, ప్లాటినమ్ ఒరిజినల్ సిట్రస్ రమ్ము, వైట్ హాల్, మేన్షన్ హౌస్, ఓల్డ్ అడ్మిరల్, అరిస్టోక్రాట్ ప్రీమియం, మార్ఫియస్, టీచర్స్ తదితర బ్రాండ్లను అందుబాటులోకి తెస్తున్నట్లు తెలుస్తోంది.

ఓటు అడుగుతారా.. లేదా?

2024 ఎన్నికల నాటికి రాష్ట్రంలో సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని అమలు చేసి, మద్యం అనేదాన్ని ఫైవ్ స్టార్ హోటళ్లకు పరిమితం చేసి, ఆ తర్వాతే ఓట్లడుగుతా.. అని ఎన్నికల ప్రచారంలో వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చెప్పారు. ఆయన చెప్పిన మాట నెరవేర్చుకోవడానికి సరిగ్గా నెలరోజుల సమయం మాత్రమే ఉంది. ఈ నెల రోజుల్లో మద్య నిషేధం చేసి ఓట్లడుగుతారా? లేక తాను చెప్పిన మాట ప్రకారం చేయలేదు కాబట్టి ఓట్లు అడగరా అనేది సరిగ్గా నెల రోజుల్లో తేలుతుంది.

అమ్మకాలే లక్ష్యంగా అడుగులు

నాలుగున్నరేళ్లుగా దశలవారీగా అంటూ నాలుక మడతేసిన నిషేధంపై మాట తప్పి, మడమ తిప్పారు. మద్య నిషేధం మాటేమో గానీ, టార్గెట్లు పెట్టి మరీ మందుబాబులను తాగించే పనిలో పడ్డారు. టార్గెట్లు తగ్గినప్పుడల్లా కొత్తకొత్త స్కీములతో మందుబాబులను ఆకర్షించేందుకు ప్రయత్నిస్తున్నారు. మద్యం అమ్మకాలు భారీగా పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. అమ్మకాలు తగ్గినప్పుడల్లా ధరలు తగ్గించి మందుబాబులు మద్యం షాపులకు దూరమవ్వకుండా జాగ్రత్త పడుతోంది. ముట్టుకుంటే షాక్ కొట్టేలా మద్యం రేట్లు పెంచి మందుబాబులను అలవాటుకు దూరం చేస్తామని చెప్పిన ప్రభుత్వం గడిచిన నాలుగున్నరేళ్లలో ఐదుసార్లు ధరలు తగ్గించింది. తాజాగా కిందటేడాది నవంబరు 18న ఒకసారి డిసెంబరు 29న మరోసారి మద్యం ధరలు తగ్గించింది. దీనికితోడు మద్యం దుకాణాలు తెరిచి ఉంచే సమయాన్ని ఏడాదికి ఒక గంట చొప్పున పెంచుతూ వస్తోంది. అయినప్పటికీ సంతృప్తి చెందని ప్రభుత్వం మందుబాబులను తిరిగి మద్యం దుకాణాలవైపు మళ్లించడానికి పాత బ్రాండ్ల నాటకాన్ని మొదలు పెట్టింది.

షాపుల్లో కొత్త బ్రాండ్లే..

గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలో పాత బ్రాండ్ల హడావుడి మొదలై వారం రోజులకు పైగా అవుతోంది. మద్యం దుకాణాల్లో కూడా సేల్స్ బాయ్స్, సూపర్‌వైజర్లు పాత బ్రాండ్లపై ఊదరగొట్టారు. కొత్త బ్రాండ్లకు భయపడి మద్యం దుకాణాలకు దూరమైన మందుబాబులను తిరిగి రప్పించుకోవడానికి ప్రభుత్వం పాత బ్రాండ్ల పేరుతో ప్రచారం చేయిస్తోందన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ఆ విమర్శలకు బలం చేకూరేలా పాత బ్రాండ్లను అడపాదడపా మాత్రమే సరఫరా చేస్తూ నాసిరకం కొత్త బ్రాండ్లనే ప్రభుత్వం మందుబాబులకు అంటగడుతున్నారు. పాత బ్రాండ్లు వస్తాయని ఆశపడిన మందుబాబులు కొందరు వాటి కోసం ప్రయత్నించి నిరాశ పడుతున్నారు. ఎప్పటిలాగే నాసిరకం కొత్త బ్రాండ్లతో సరిపుచ్చుకుంటున్నారు. వారం పది రోజులుగా పాత బ్రాండ్లపై హడావుడి కనిపిస్తున్నా తమకు అందుబాటులోకి రాకపోవడంతో మందుబాబులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం పాత బ్రాండ్లు అందుబాటులోకి తెస్తోంది తమ కోసమా? లేక ఎన్నికలలో పంపిణీ కోసమా అని వారు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పాత బ్రాండ్లని మద్యం దుకాణాలకు చేరకుండానే వాటిని అధికారపార్టీ నేతలు మాయం చేస్తున్నారేమోనన్న సందేహం కలుగుతోంది. ఎన్నికల్లో నాసిరకం మద్యం పంపిణీ చేస్తే ఫలితం ఉండదని భావించి ప్రభుత్వమే ఇలా అడ్డదారులు తొక్కుతోందేమోనని వారు భావిస్తున్నారు. మద్యం దుకాణాల్లో కొత్త బ్రాండ్లు తప్ప పాత బ్రాండ్లు లేకపోవడంతో వారి అనుమానాలకు బలం చేకూరుతోంది.

కాంట్రాక్టర్లు..కుమ్మక్కు?

- కోటయ్యకు తగ్గిన తలనీలాల ఆదాయం
- గత ఏడాది కంటే రూ.19.32 లక్షల తక్కువకు టెండర్



నరసరావుపేట, ఫిబ్రవరి 28: కోటప్పకొండ శ్రీత్రికోటేశ్వర స్వామి దేవస్థానంలో తలనీలాల సేకరణకు సంబంధించిన నిర్వహించిన టెండర్లలో కాంట్రాక్టర్లు కుమ్మక్కయ్యారు. గత ఏడాది కంటే రూ.19.32 లక్షల తక్కువకు టెండర్ దాఖలైంది. దీంతో కోటయ్యస్వామికి తలనీలాల ఆదాయం తగ్గిపోయింది. ఈ ఏడాదికి సంబంధించి రూ.25.18 లక్షలకు టెండర్ దాఖలైందని ఆలయ అధికారులు బుధవారం తెలిపారు. గత ఏడాది రూ.44.50 లక్షలకు టెండర్ దాఖలు కాగా ఈ ఏడాది రూ.19.32 లక్షలకు తగ్గడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సాధారణంగా ఏటా తలనీలాల ఆదాయం పెరగాల్సి ఉండగా తగ్గడం వెనుక అధికార పార్టీ నేతల హస్తం ఉందన్న ఆరోపణలున్నాయి. కాంట్రాక్టర్లు కుమ్మక్కై ఉంటారన్న ఆరోపణలున్నాయి. అయితే ప్రముఖ ఆలయాల్లో కూడా తలనీలాల ఆదాయం తగ్గిందన్న వాదనను కార్యాలయ వర్గాలు వినిపిస్తున్నాయి. కోటప్పకొండ టెండర్ ఆమోదం కోసం దేవదాయశాఖ కమిషనర్‌కు అధికారులు లేఖ పంపారు. కమిషనర్ నిర్ణయం మేరకు టెండర్ ఆమోదం ఆధారపడి ఉంది. కమిషనర్ అనుమతి ఇవ్వకపోతే టెండర్‌ను రద్దు చేస్తామని అధికారులు తెలిపారు. ఆదాయం పెంచేందుకు అధికారులు కృషి చేస్తారా లేక తక్కువకు టెండర్ ఆమోదిస్తారో చూడాలి. అయితే టెండర్ ఆమోదం కోసం అధికారులపై అధికార పార్టీ నేతలు ఒత్తిడి తెస్తున్నట్లుగా ప్రచారం జరుగుతుంది.



రహదారులను పరిశీలిస్తున్న ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

ట్రాఫిక్ నియంత్రణకు.. ప్రణాళిక

తిరునాళ్లలో ట్రాఫిక్ సమస్యలకు చెక్ ● ఎస్పీ రవి శంకర్‌రెడ్డి

కోటప్పకొండ(నరసరావుపేట), ఫిబ్రవరి 28: కోటప్పకొండ తిరునాళ్లలో ట్రాఫిక్ జామ్ కాకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని, పక్కా ప్రణాళిక అమలు చేయనున్నట్లు ఎస్పీ రవిశంకర్‌రెడ్డి తెలిపారు. కోటప్పకొండకు ఉన్న రహదారులను బుధవారం ఆయన పరిశీలించారు. రాష్ట్ర పండుగ హోదా కలిగిన కోటప్పకొండ తిరునాళ్ళకు రాష్ట్ర నలుమూలల నుంచి, తెలంగాణ నుంచి కూడా భక్తులు భారీగా తరలివచ్చి శ్రీ త్రికోటేశ్వర స్వామి వారిని దర్శించుకుంటారన్నారు. తిరునాళ్ళకు వచ్చేవారు కొండకు ఏవైపు నుంచి ఎక్కువగా వస్తున్నారో అంచనా వేసి అక్కడ ప్రణాళిక రూపొందించి, ఆర్‌అండ్‌బీ అధికారుల సహకారంతో వీలైనంత వరకు రోడ్లను వాహనాల రాకపోకలకు అనువుగా ఉండేందుకు చర్యలు తీసుకోవలసి ఉందన్నారు. దేవుని దర్శనం సమయంలో తొక్కిసలాటలు జరగకుండా అవసరం వున్న చోట క్యూలైన్లు ఏర్పాటు చేసి, అక్కడ ఎంత మంది పోలీస్ అధికారులను మరియు సిబ్బందిని నియమించాలి అనే అంశం పరిశీలించామన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చేవారు స్వామి వారిని ప్రశాతంగా దర్శనం చేసుకుని తిరిగి స్వగృహాలకు వెళ్ళడానికి పోలీస్ శాఖ తరఫున తీసుకోవలసిన అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ఏడాది తిరునాళ్ళను ఘనంగా నిర్వహించడానికి పోలీస్ శాఖ అంతా సంసిద్ధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (క్రైం) లక్ష్మీపతి, నరసరావుపేట డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ, ఎస్బీ సీఐలు ప్రభాకర్, బలనాగిరెడ్డి, నరసరావుపేట రూరల్ సీఐ మల్లికార్జునరావు, చిలకలూరిపేట రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బరిలోకి దిగకుండానే.. రమణ వాకౌట్

- గుంటూరు నుంచి పోటీకి ఎంపీ అభ్యర్థి వెనుకంజ
- బావమరిదికి బదులు బరిలోకి రోశయ్యకు అవకాశం
- పొన్నూరు నుంచి లోక్‌సభకు ఎమ్మెల్యే కిలారి వలస
- పొన్నూరు తెరపైకి మంత్రి అంబటి సోదరుడు మురళీకృష్ణ

గుంటూరు(ఆంధ్రజ్యోతి), పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 28: టీడీపీ, జనసేన పొత్తు ఖరారు.. ఆ పార్టీ అధినేతలు ఉమ్మడిగా ఎన్నికలకు శంఖారావటం పూరించటంతో వైసీపీలో వణుకు మొదలైందా.. అంటే జరుగుతున్న పరిణామా లు అవును అన్నట్లుగా ఉన్నాయి. అభ్యర్థుల ఎంపిక ఇప్పటికే పూర్తయింది.. ఇక మార్పులు, చేర్పులు ఒకటి రెండు మినహా ఉండవని సీఎం జగన్ ప్రకటించిన గంటల వ్యవధిలోనే గుంటూరు లోక్‌సభ పరిధిలోనే ఇద్దరిని మార్చేశారు. గుంటూరు ఎంపీ అభ్యర్థిగా ఇప్పటికే ఖరారైన ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి తనయుడు వెంకటరమణ ఇంకా బరిలోకి దిగక ముందే ఓటమి భయంతో పోటీ నుంచి తప్పుకున్నారు. విజయావకాశాలు ఏ మాత్రం లేని గుంటూరు లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసి ఓటమిని మూటకట్టుకోవటమే కాకుండా రూ.కోట్లు వ్యయం చేసుకోవడం అవుతుందని ఆయ న భావించారని సమాచారం. తనను పోటీ నుంచి తప్పించమని అధిష్ఠానానికి మొర పెట్టుకున్నారు. ఈ పరిస్థితుల్లో ఆయన్ను తప్పించి ఆ స్థానంలో ఆయన బావ పొన్నూరు ఎమ్మెల్యే రోశయ్యను బరిలోకి దించారు. విశేషమేమిటంటే పొన్నూరులో విపరీతమైన అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటూ స్వపక్షం సైతం వ్యతిరేకించిన రోశయ్యకు పదోన్నతి కల్పించి ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దించడంపై ఆ పార్టీలోనే నిరసన వ్యక్తమవుతుంది.

కిలారికి పదోన్నతి..

వెంకటరమణ బరిలోకి దిగకుండానే వాకౌట్ చేయడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో ఆయన బావ పొన్నూరు ఎమ్మెల్యే రోశయ్యను గుంటూరుఎంపీ అభ్యర్థిగా బరిలోకి దించుతున్నట్లు వైసీపీ అధిష్ఠానం బుధవారం ప్రకటించింది. గత ఎన్నికల్లో వైసీపీ గాలిలో తొలిసారి చట్టసభలోకి అడుగుపెట్టిన రోశయ్య స్వపక్షం నుంచే తీవ్ర వ్యతిరేకతను మూటకట్టుకున్నారు. ఆయనకు టికెట్ ఇస్తే ఓడిస్తామని సొంత పార్టీ నాయకులు రోడ్డెక్కి నిరసనలు తెలిపారు. అంతేగాక తాడేపల్లి ప్యాలెస్‌కు వెళ్లి పార్టీ పెద్దలకు వినతిపత్రాలు కూడా అందజేశారు. ఈ నేపథ్యంలో రోశయ్య తిరిగి గెలిచే అవకాశాలు ఏ మాత్రం లేవని అధిష్ఠానం భావించింది. అయితే ఉమ్మారెడ్డిపై గౌరవంతో ఇప్పటి వరకు రోశయ్యను కదిలించలేదు. అయితే నెల రోజుల క్రితం ఉమ్మారెడ్డి తనయుడు వెంకటరమణను గుంటూరు వైసీపీ ఎంపీ అభ్యర్థిగా బరిలో దించారు. అయితే ఆయన ఇంత వరకు కార్యరంగంలోకి దిగకుండానే పరార య్యారు.



మురళీకృష్ణ



రోశయ్య

రోశయ్య స్థానంలో మురళీకృష్ణ

రోశయ్య స్థానంలో పొన్నూరు వైసీపీ అభ్యర్థిగా మంత్రి రాంబాబు సోదరుడు బిల్డర్ అంబటి మురళీకృష్ణను బరిలోకి దించారు. మురళీకృష్ణ కుటుంబం మూలాలు పొన్నూరు మండలం మామిళ్లపల్లిలో ఉన్నప్పటికీ వారు రేపల్లె వలస వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. అయితే పొన్నూరు సీటును ఆశిస్తున్న మురళీకృష్ణ ఏడాది కాలంగా మామిళ్లపల్లిలో స్థిరనివాసం ఏర్పరుచుకున్నారు. భజరంగ్ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసి వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నారు. అయితే మురళీకృష్ణ నియామకంపై వైసీపీలోనే భిన్నాభిప్రాయం వ్యక్తమవుతుంది.

2న గురజాలలో.. రా కదలిరా

- సభలో శ్రేణులకు చంద్రబాబు దిశానిర్దేశం
- నేడు వేదికను ఖరారు చేయనున్న నేతలు

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 28: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు రా కదలిరా.. బహిరంగ సభ మార్చి 2 శనివారం గురజాలలో ఏర్పాటు చేస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీని వాసరావు బుధవారం తెలిపారు. శనివారం మధ్యాహ్నం 2 గంటలకు గురజాలలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలి పారు. సభా ప్రాంగణం ఎక్కడ అనేది గురువారం టీడీపీ, జనసేన నాయకులతో కలిసి నిర్ణయిస్తామన్నారు. తొలుత మార్చి 2, 3 తేదీల్లో నరసరావుపేటలో భారీ బహిరంగ సభ నిర్వహించాలని పార్టీ భావించింది. అయితే నరసరావుపేటలో జరగాల్సిన సభను శనివారం గురజాలలో నిర్వహించేందుకు పార్టీ పెద్దలు నిర్ణయించారు. ఈ బహిరంగ సభ ద్వారా పార్టీ శ్రేణులకు చంద్రబాబు దిశా నిర్దేశం చేయనున్నారు.

బియ్యం, చక్కెరతో.. నరి

టీడీపీ హయాంలో..
- బియ్యం
- పంచదార , కందిపప్పు
- గోధుమలు/గోధుమ పిండి
- పామాయిల్, రాగులు/జొన్నలు/సజ్జలు

వైసీపీ పాలనలో..
- కేంద్రం ఇచ్చే బియ్యం
- అరకేజీ పంచదార (మార్కెట్ ధరతో సమానం)
- అరకొరగా కందిపప్పు

- చతికిల పడిన సరుకుల పంపిణీ
- రేషన్ సబ్సిడీ నిధులను దారి మళ్లించి కోత
- సన్నబియ్యంతో నిత్యావసరాలు ఇస్తామని ప్రగల్భాలు
- కేంద్రం ఇచ్చే బియ్యం, అరకేజీ పంచదార మాత్రమే సరఫరా
- బహిరంగ మార్కెట్లో ధరలు ఆకాశాన్ని అంటుతున్నా పట్టని వైనం

చెప్పేది పెద్దపెద్ద మాటలు.. చేతల్లోకి వచ్చే సరికి అరకొరగానే అమలు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రేషన్ సరుకుల పంపిణీకి ఇది సరిగ్గా సరిపోతోంది. గత ప్రభుత్వ హయాంలో రేషన్ డిపోల ద్వారా కార్డుదారులకు బియ్యం, పంచ దార, కంది పప్పు, గోధుమలు/గోధుమ పిండి, పామాయిల్, రాగులు/జొన్నలు/సజ్జలు వంటివి ఇచ్చే వ్యవస్థ ఉండేది. అయితే తాను అధికారంలోకి వస్తే ఆ సరుకులన్నీ కూడా డోర్ డెలివరీ చేస్తానని వైసీపీ అధినేత ఎన్నికల ప్రచారంలో ప్రకటించారు. అయితే అధికారం చేపట్టిన తర్వాత కేవలం బియ్యం, చక్కెర మాత్రమే పేదలకు ఇచ్చి వాటితోనే బతకమని చెబుతున్నారు. వీటిలో కూడా కేంద్రం బియ్యం ఇస్తుండగా.. మార్కెట్ ధరతో సమా నంగా ఉన్న అర కేజీ పంచదార కార్డుదారులకు అంద చేస్తున్నారు. ఈ రెండు సరుకుల కోసం ఎండీయూ వాహనం.. దానికో సైరన్.. డ్రైవర్ ఒకరు.. మరొక సహాయకుడు.. వీధుల్లో ఆ వాహ నం వద్ద కార్డు దారుల బారులు.. ఇదీ ప్రస్తుతం రేషన్ పంపిణీ తీరు. దీనిపై అటు ప్రతిపక్షాలు, ఇటు కార్డుదారులు అసహనం వ్యక్తం చేస్తున్నా తాము పేదల కోసమే ఉన్నామని వైసీపీ పాలకులు ప్రగల్భాలు పలుకుతున్నారు.

రేషన్ సరుకులకు గండి

సత్తెనపల్లి, ఫిబ్రవరి 28: : తాను అధికారంలోకి సన్న బియ్యంతో పాటు నిత్యావసర సరుకులను పేదలకు డోర్ డెలివరీ చేస్తానని వైసీపీ అధినేత జగన్ ఎన్నికల ప్రచారంలో ప్రకటించారు. అయితే అధికారంలోకి వచ్చిన నాలుగు సంవత్సరాల 9 నెలల నుంచి కేవలం బియ్యం, చక్కెర మాత్రమే పేదలకు ఇచ్చి వాటితోనే బతకమని చెబుతున్నారు. పేదల గురించి తరచుగా మాట్లాడే సీఎం జగన్ వారికి ప్రతీ నెలా ఇవ్వాల్సిన రేషన్ సరుకుల వద్దకు వచ్చేసరికి నాలిక మడత పెడుతున్నారు. ఎన్నికలు పేదలకు, పెత్తందార్లకు మధ్య జరగబోతోన్నాయని పెద్దపెద్ద మాటలు చెబుతూ పేదలకు హక్కుగా రావాల్సిన రేషన్ సరుకులకు గండి కొడుతున్నారు. రేషన్ సబ్సిడీ నిధులను దారి మళ్లించడంతో సరుకులకు కోత పడుతుంది. తప్పనిసరి పరిస్థితుల్లో కేంద్రం నుంచి వస్తున్న బియ్యాన్ని మాత్రం నెల నెలా కార్డుదారులకు ఇస్తున్నారు. ఇక ఆ ఒక్కదానితో సరిపెడితే బాగుండదేమోనని మార్కెట్ ధరతో సమానంగా ఉన్న అరకేజీ పంచదారను అందచేస్తున్నారు. ప్రభుత్వం గత టీడీపీ, కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో ప్రతీ కుటుంబానికి క్రమం తప్పకుండా రేషన్ సరుకులు అందేవి. వాటికి అదనంగా నెలలో మరికొన్ని సరుకులు బయట తీసుకుంటే ఎలాంటి ఇబ్బంది లేకుండా పేదలకు భోజన అవసరాలు తీరిపోయేవి. నేడు ఆ పరిస్థితి లేకుండా పోయింది. తాను అధికారంలోకి వస్తే 5, 10, 15, 20, 25 కేజీల బస్తాల రూపంలో వలంటీర్లు ఇంటికి తీసుకొచ్చి ఇస్తారని వాగ్దానం చేశారు. అయితే అది కార్యరూపం దాల్చలేదు. కేవలం బియ్యం, చక్కెర మాత్రమే ఎండీయూ ఆపరేటర్ల ద్వారా పంపిణీ చేస్తున్నారు. కందిపప్పు ఒక నెల ఇస్తే మళ్లీ ఎప్పుడు ఇస్తారో, లేదో తెలియని పరిస్థితి. అది కూడా అందరికీ కాకుండా కేవలం కొందరికి మాత్రమే అందుతుంది. ఎవరైనా కార్డుదారులు కందిపప్పు కావాలని అడిగినా లేదనే సమాధానం ప్రతీ నెల ఎండీయూ వాహనదారుల నుంచి వస్తుంది. గోధుమ పిండి ప్యాకెట్లు అరకొరగా ఇస్తున్నా అవి కొద్ది రోజులకే పురుగు పడుతున్నాయి. దీంతో వినియోగదారులు వాటిని తీసుకోవడం లేదు. పామాయిల్ అసలే ఇవ్వడం లేదు. బియ్యానికి బదులుగా రాగులు/జొన్నలు/సజ్జలు ఇచ్చేవారు. వాటికి కూడా వైసీపీ ప్రభుత్వం శుభంకార్డు వేసింది. ఇలా పేదలకు రేషన్ సరుకుల్లో కోత పెట్టి సబ్సిడీ రూపంలో భరించాల్సిన నిధులను దారి మళ్లిస్తుండటంపై తీవ్ర విమర్శలు వ్యక్తమౌతున్నాయి.

పేదలపై ఆర్థిక భారం

వైసీపీ పాలనలో రేషన్ సరుకుల పంపిణీ పూర్తిగా చతికల పడిందని కార్డుదారులు విమర్శిస్తున్నారు. ఒక వైపు బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు, నూనెలు, ఇతర నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని అంటుతున్నా నియంత్రణకు చర్యలపై ప్రభుత్వం దృష్టి సారించడంలేదు. గత ప్రభుత్వాల హయాంలో మార్కెట్‌లో ధరల పెరుగుదలను అడ్డుకునేందుకు రేషన్ ద్వారా ఆయా సరుకులను అందజేసే వారు. దీంతో బహిరంగ మార్కెట్‌లో ఆయా సరుకులకు డిమాండ్ తగ్గి ధరలు అందుబాటులోకి వచ్చేవి. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ దిశగా ప్రభుత్వం ఆలోచనే చేయడం లేదు. దీంతో నిత్యావసరాల ధరలు సామాన్యులకే కాదు మధ్య తరగతివర్గాలకు కూడా అందుబాటులో ఉండటం లేదు. ప్రభుత్వ తీరుతో ప్రజలపై తీవ్ర ఆర్థిక భారం పడుతుంది. మరో వైపు రేషన్ పంపిణీ వ్యవస్థతో పెద్దగా ప్రయోజనం చేకూరడంలేదు. కిలో కంది పప్పు రకాలను బట్టి రూ.160 నుంచి రూ.200 వరకు పలుకుతుంది. రేషన్ డిపోల ద్వారా సరఫరా చేస్తే పేదలపై ఆర్థిక భారం తగ్గేది. టీడీపీ పాలనలో ప్రతి నెల కిలో కందిపప్పు రూ.40కి సరఫరా చేసేది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ధరను రూ.67కు పెంచింది. అయినా అందరికీ కందిపప్పును సక్రమంగా ఇవ్వడం లేదు. టీడీపీ ప్రభుత్వ హయాంలో కిలో పంచదార రూ.14కు ఇచ్చేవారు. జగన్ దానిని అరకిలోకు పరిమితం చేశారు. పైగా ధరను మార్కెట్ ధరతో సమానంగా పెంచేశారు. నాడు రాగులు, జొన్నలు వంటివి కూడా రాయితీపై కార్డుదారులకు ఇచ్చేవారు. సంక్రాంతి, క్రిస్మస్, రంజాన్ తదితర పండుగ ల సమయంలో ఆయా వర్గాలకు ప్రత్యేకంగా ఉచితంగా కానుకలు అందజేసి పేదలను ఆదుకునే వారు. అయితే పేదలకు ఎంతో చేస్తున్నామని చెపుతున్న జగన్ పండుగ కానుకలను రద్దు చేశారు. రేషన్ సరుకుల పంపిణీకి ఎండీయూ వాహనాలను లక్షలు ఖర్చు పెట్టి కొనుగోలు చేశారు. ఒక్కొక్క వాహన దారుడికి నెలకు రూ.21 వేలు చొప్పున చెల్లిస్తున్నారు. ఇంత ఖర్చు చేసి కేవలం పంచదార, బియ్యం ఇవ్వడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.



టీడీపీ హయాంలో పంపిణీ చేసిన నిత్యావసరాలు



◆ సమావేశంలో కలెక్టర్ శివశంకర్

నిబంధనలు ఉల్లంఘిస్తే ఉపేక్షించం

- అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలి
- రాజకీయ పార్టీల సమావేశంలో కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట, ఫిబ్రవరి 28: త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఎన్నికల నియమావళి(ఎంసీసీ), నిబంధనలను ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదని కలెక్టర్ శివశంకర్ తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం జరిగిన రాజకీయ పార్టీల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల నియమావళి అమలులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. ప్రతి అధికారి నిష్పక్షపాతంగా విధులను నిర్వహించాలని ఆదేశించారు. గత ఎన్నికల కంటే ఈ ఎన్నికల్లో పోలింగ్ శాతాన్ని పెంచాలని, ఇందుకు రాజకీయ పార్టీలు కూడా కృషి చేయాలన్నారు. ఎన్నికల నియమావళి అమలు, ఖర్చులు తదితర అంశాలపై ఎంసీసీ బృందాలు, ఏఈఆర్‌వోలు, వ్యయ పరిశీలకులు, ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్, పోలీసులు, వీడియో, ఇతర సిబ్బందికి శిక్షణా కార్యక్రమం పూర్తయిందని తెలిపారు. 6, 7, 8 దరఖాస్తుల పెండింగులన్నీ పూర్తి చేయాలన్నారు నోటిఫికేషన్ జారీ నుంచి ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ఎంసీసీ అమల్లో ఉంటుందని తెలిపారు. ఎన్నికల కమిషన్ హ్యాండ్ బుక్‌లో ఉన్న అంశాలపై ఎన్నికల సిబ్బంది సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో వినాయకం, ఆర్డీవో అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మూడు హిస్టారికల్ వెబ్ సిరీస్‌లు



సినిమాల్లో వాణిజ్య అంశాలతో పాటు సామాజిక ప్రయోజనం కూడా ఉండాలని నమ్మే దర్శకుల్లో ఎన్.శంకర్ ఒకరు. పలు విభిన్న చిత్రాలు రూపొందించిన ఆయన తాజాగా చారిత్రక నేపథ్యంలో మూడు వెబ్ సిరీస్‌లు తీయడానికి సంకల్పించారు. బుధవారం వాటి విశేషాలు వెల్లడిస్తూ 'తెలంగాణ సాయుధ పోరాటం, తెలంగాణ ప్రాంతం ఇండియన్ యూనియన్‌లో కలవడం, ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడడం, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం జరిగిన పోరాట నేపథ్యం, తెలంగాణ రాష్ట్రం ఏర్పడేంతవరకూ ఉద్యమాల్లో జరిగిన ఆటుపోట్లు... తదితర అంశాలను ప్రజల కోణంలో చూపించాలని మా ప్రయత్నం. అక్టోబర్ నుంచి షూటింగ్‌కు శ్రీకారం చుడతాం' అని చెప్పారు. అలాగే జ్యోతీరావు పూలే అనుభవాలు, అవమానాలు కథాంశంగా మరో వెబ్ సిరీస్‌ను, అదే విధంగా బాబా సాహెబ్ అంబేద్కర్ ఇచ్చిన రాజ్యాంగ స్ఫూర్తి ఇతివృతంగా ఇంకో వెబ్ సిరీస్ నిర్మిస్తామని ఆయన చెప్పారు. జ్యోతిరావు పూలే, అంబేద్కర్ వెబ్ సిరీస్‌లు వారి బయోగ్రఫీలు కాదని శంకర్ స్పష్టం చేశారు. తెలుగు, హిందీ భాషల్లో ఈ మూడు వెబ్ సిరీస్‌లు నిర్మిస్తామనీ, మూడేళ్ల నుంచి తన టీమ్‌తో కలసి కథలపై వర్క్ చేస్తున్నామని తెలిపారు.

రాజుగారి అమ్మాయితో నాయుడుగారి అబ్బాయి



రవితేజ నున్నా, నేహా జురెల్ జంటగా నటించిన 'రాజుగారి అమ్మాయి- నాయుడుగారి అబ్బాయి' చిత్రం ట్రైలర్‌ను బుధవారం దర్శకుల సంఘం అధ్యక్షుడు వీరశంకర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'అందరికీ కనెక్ట్ అయ్యే టైటిల్‌తో విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందిన చిత్రం ఇది. సినిమా విజయం సాధించాలి' అని కోరారు. నిర్మాతల్లో ఒకరైన ముత్యాల రామదాసు మాట్లాడుతూ 'చిన్న సినిమాలు కూడా పెద్ద విజయం సాధిస్తున్నాయి. దర్శకుడు సత్యరాజ్‌కు మంచి విజన్ ఉంది. ఎన్నో సమస్యలు ఎదురైనా ఎక్కడా రాజీపడకుండా తీసిన సినిమా ఇది. మార్చి 9న విడుదల చేస్తున్నాం. సినిమాలో హీరోగా నటించిన కొత్త నటుడు రవితేజ పెద్ద హీరోగా ఎదగాలి' అన్నారు. 'ముత్యాల రామదాసు గారు మా వెనుక ఉండి ఈ సినిమాను విజయవంతంగా పూర్తి చేయించారు. మా అమ్మ నున్నా కుమారిగారు లేకపోతే ఈ ప్రాజెక్ట్ కంప్లీట్ అవదు. ఈ సినిమా కోసం ఎంతో కష్టపడ్డాం. అందరినీ ఆకట్టుకొనే చిత్రం అవుతుంది' అన్నారు రవితేజ. ఈ చిత్రనిర్మాణంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ దర్శకుడు సత్యరాజ్ కృతజ్ఞతలు తెలిపారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్‌ఎల్ https://ejyothy.com/NwRzjye లో చదవండి.

ప్రేక్షకులు గర్వపడేలా ఆపరేషన్ వాలెంటైన్



వరుణ్‌తేజ్, మానుషి చిల్లర్ జంటగా నటించిన 'ఆపరేషన్ వాలెంటైన్' మార్చి ఒకటిన విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాతలు సిద్దు ముద్దా, నందకుమార్ అబ్బినేని బుధవారం మీడియాతో మాట్లాడారు

● దర్శకుడు శక్తి ప్రతాప్‌సింగ్ రూపొందించిన షార్ట్ ఫిల్మ్ మాకు, వరుణ్‌కి బాగా నచ్చింది. దాన్నే ఫుల్ లెంగ్త్ ఫీచర్ ఫిల్మ్‌గా చేయాలనే ప్రయత్నాల్లో దర్శకుడు ఉన్నప్పుడు ఆ కథ విన్నాం. బాగా నచ్చడంతో సినిమా తీయాలని నిర్ణయించుకున్నాం. సోనీ పిక్చర్స్ నిర్మాణ భాగస్వామిగా రావడంతో తెలుగు, హిందీ భాషల్లో గ్రాండ్‌గా తీశాం.

● కొత్త వాడైనా ప్రతాప్ సింగ్‌కు మంచి క్లారిటీ ఉంది. సినిమాకు ఏం కావాలో ఆయనకు స్పష్టంగా తెలుసు. అలాగే తను అదే నేపథ్యం నుంచి వచ్చారు కనుక వీఎఫ్ఎక్స్ మీద మంచి కమాండ్ ఉంది. 'ఫైటర్' తర్వాత ఇలాంటి భారీ ఎయిర్ సీక్వెన్స్‌తో ఇండియాలో వచ్చిన మా చిత్రాన్ని ఆయన చాలా అద్భుతంగా తీశారు. గ్వాలియర్ ఎయిర్ బేస్‌లో సినిమాను షూట్ చేశాం. రియల్ ఎయిర్ బేస్‌లో షూటింగ్ చేయడం ఒక కొత్త అనుభూతి. వాయు సేన సైనికుల త్యాగాలను, ధైర్యాలను స్మరించుకుంటూ వాళ్ల కథని ప్రేక్షకులకు చెప్పాలనే ఆలోచనతో ఈ సినిమా నిర్మించాం.

'హాఫ్ లయన్'గా పీవీ బయోపిక్



ఆహా స్టూడియో, అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా భారతరత్న పురస్కార గ్రహీత, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జీవిత ప్రస్థానాన్ని బయోపిక్ రూపంలో తెర మీదకు తీసుకురావడానికి సిద్ధమయ్యాయి. ఈ ప్రతిష్ఠాత్మక బయోపిక్‌ను 'హాఫ్ లయన్' పేరిట వెబ్ సిరీస్‌గా రూపొందిస్తున్నారు. ప్రముఖ రచయిత వినయ్ సీతాపతి రచించిన 'హాఫ్ లయన్' పుస్తకం ఆధారంగా జాతీయ అవార్డు గ్రహీత, నటుడు ప్రకాష్ ఝా ఈ సిరీస్‌ను నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ పాన్ ఇండియన్ సిరీస్ ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. హిందీ, తెలుగు, తమిళ భాషల్లో ఈ సిరీస్‌ను విడుదల చేయబోతున్నారు. పీవీ నరసింహారావు జీవితంలోని కీలక మైలురాళ్లను ఈ సిరీస్ హైలైట్ చేయనుంది.

అందరినీ మెప్పిస్తుందనే నమ్మకం ఉంది



శివ కందుకూరి హీరోగా రూపొందిన క్రైమ్‌థ్రిల్లర్ 'భూతద్ధం భాస్కర్ నారాయణ'. పురుషోత్తం రాజ్ దర్శకత్వంలో స్నేహాల్, శశిధర్, కార్తీక్ నిర్మించారు. రాశి సింగ్ కథానాయిక. మార్చి 1న ఈచిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా ప్రీ రిలీజ్ ట్రైలర్ ఈవెంట్‌ను చిత్రబృందం నిర్వహించింది. శివ కందుకురి మాట్లాడుతూ "భూతద్ధం...'ప్రచార చిత్రాలకు ప్రేక్షకుల నుంచి అద్భుత స్పందన వచ్చింది. సినిమా అందరికీ నచ్చుతుందనే నమ్మకం ఉంది. గీతా డిస్ట్రిబ్యూషన్ విడుదల వల్ల సినిమా మరింత మంది ప్రేక్షకులకు చేరువవుతుంది' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'ఈ సినిమాతో దర్శకుడిగా నా కల నెరవేరింది. శ్రీ చరణ్ అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు. శివ లాంటి హీరో దొరికినందుకు ఆనందంగా ఉంది. సినిమా చాలా బాగా వచ్చింది. ఆదరించండి' అని ప్రేక్షకులను కోరారు.


నాయర్ నా భర్తే : మలయాళ నటి హర్షం



'గగన్‌యాన్'కు సంబంధించి ఎంపికైన నలుగురు వ్యోమగాముల్లో ప్రశాంత్ నాయర్ ఒకరు. వ్యోమగామిగా ఈయనను ఎంపిక చేస్తూ ప్రధాని మోదీ ప్రకటించిన తర్వాత మలయాళ సినీ నటి, స్నేహం సినిమాలో నటించిన లీనా సంతోషంతో ఉక్కిరిబిక్కిరికి గురయ్యారు. "నాయర్ నా భర్తే, మాకు గత నెల 17న వివాహం జరిగింది. మాది పెద్దలు కుదిర్చిన వివాహం. నాయర్‌ను వ్యోమగామిగా ప్రకటించిన సందర్భం నా జీవితంలో మరువలేనిది. ఇదొక చరిత్రాత్మక ఘట్టం. ఈ దేశానికి, మా రాష్ట్రానికి(కేరళ), వ్యక్తిగతంగా నాకు ఎంతో గర్వకారణం" అని ఆమె పేర్కొన్నారు.

దిక్సూచి DIKSUCHI

నదీ జలాల వివాదాలు




ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

అల్మట్టి వివాదం

- కర్ణాటక, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నాటి నుంచి ఈ వివాదం ఉంది.
- దీనికి సంబంధించిన ట్రిబ్యునల్స్: బచావత్ ట్రిబ్యునల్, బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్
- అల్మట్టి డ్యాం వాస్తవ ఎత్తు: 517 మీటర్లు
- ఎత్తు పెంచడంలో భాగంగా కర్ణాటక ప్రతిపాదించిన ఎత్తు: 524. 25 మీటర్లు
- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదించిన ఎత్తు: 519.6 మీటర్లు

కృష్ణా నది జలాల వివాదం (బ్రిజేష్ కుమార్ ట్రిబ్యూనల్)

- 1969 ఏప్రిల్ 10: బచావత్ ట్రిబ్యూనల్ ఏర్పాటు (ఇంటర్ స్టేట్ వాటర్ డిస్ప్యూట్స్ యాక్ట్-1956 ప్రకారం)



- ఇది 1973లో తుది తీర్పు ఇచ్చింది. దీనిలో స్కీమ్-ఎ లో నికర జలాలు, స్కీమ్-బి లో మిగులు జలాలను పంపిణీ చేసింది. కృష్ణా నదిలో లభించే మొత్తం నీటిలో 75 శాతం నికర నీటి లభ్యతగా గుర్తించి పంచింది.
- 1976 మే 31: ప్రభుత్వం బచావత్ ట్రిబ్యునల్ తుది తీర్పు గెజిట్‌ను ప్రకటించింది.

దీని ప్రకారం కృష్ణా నదిలో నికర జలాల లభ్యత 2060 టీఎంసీలుగా పేర్కొంది.

- మహారాష్ట్ర - 560, కర్ణాటక-700, ఆంధ్రప్రదేశ్ 800 టీఎంసీల నీటి వాటా కలిగి ఉన్నాయి.

నోట్: మిగులు జలాలు అంటే...ప్రాజెక్టులలోని నీటిని కాలువల ద్వారా పొలాలకు మళ్లించి సాగునీటికి, వివిధ అవసరాలకు ఉపయోగించగా, మిగిలిపోయి తిరిగి నదిలో కలిసే జలాలు.

- ట్రిబ్యునల్ 70 టీఎంసీలను మిగులు జలాలుగా పేర్కొని, మహారాష్ట్రకు-25, కర్ణాటకకు-45, ఆంధ్రప్రదేశ్‌కు-11 టీఎంసీలు కేటాయించింది.
- 2004 ఏప్రిల్ 2: బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ఏర్పాటు చేస్తూ కేంద్రం నోటిఫికేషన్ జారీ చేసింది. 2006 ఫిబ్రవరి 1 నుంచి ట్రిబ్యునల్ అధికారికంగా అమలులోకి వచ్చింది. 2010 డిసెంబరు 31న కర్ణాటకకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. అదేవిధంగా మిగులు జలాల వాటాను ఆంధ్రప్రదేశ్‌తోపాటు కర్ణాటక, మహారాష్ట్రకు పంచింది. కృష్ణానది నికర నీటి లభ్యతను 2594 టీఎంసీలుగా లెక్కించింది(మిగులు జలాలను కూడా కలిపింది). మహారాష్ట్రకు-666 టీఎంసీలు, కర్ణాటకకు-911 టీఎంసీలు, నది పరిరక్షణ కోసం-16 టీఎంసీలు, ఆంధ్రప్రదేశ్‌కు-1001 టీఎంసీలు కేటాయించింది.

నోట్: తదుపరి నది జలాల పునఃసమీక్ష 2050 తర్వాతే ఉంటుందని రిపోర్ట్ పేర్కొంది.

కావేరీ నది జలాల వివాదం

కావేరీ నది నీటిని తమిళనాడు గ్రాండ్ ఆనకట్ట (కళ్లనై డ్యామ్)ను రెండవ శతాబ్దంలో నిర్మించడం ద్వారా, 1934లో నిర్మించిన మెట్టూరు డ్యామ్ ద్వారా చాలా సంవత్సరాల నుంచి వినియోగించుకుంటోంది. అయితే కర్ణాటక 1932లో కృష్ణరాజ సాగర్ డ్యామ్ ద్వారా, తమిళనాడుకు వచ్చే కావేరీ జలాల లభ్యత తగ్గిపోవడంతో వివాదాలు ప్రారంభమయ్యాయి.

- కావేరీ నది పరివాహక ప్రాంతం: తమిళనాడు, కర్ణాటక, కేరళ, పాండిచ్చేరిలో ఉంది.
- 1990లో కేంద్ర ప్రభుత్వం కావేరీ వాటర్ డిస్ప్యూట్ ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేసింది.
- 1998లో కావేరీ రివర్ అథారిటీని ఏర్పాటు చేసింది
- 2028 సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కావేరీ నది జలాల పంపిణీ: మొత్తం 726 టీఎంసీలలో కర్ణాటకు 284.75, తమిళనాడుకు 404.25, కేరళకు 30, పాండిచ్చేరికి 7 టీఎంసీల వాటా లభించింది.

ముల్ల పెరియార్ డ్యామ్ వివాదం

ప్రస్తుత కేరళ రాష్ట్ర సరిహద్దు లోపల, ఒకప్పటి ట్రావెన్ కోర్ సంస్థానంలో పెరియార్ నదిపై ఈ డ్యామును నిర్మించారు. 1886లో బ్రిటిష్ ప్రభుత్వం, ట్రావెన్ కోర్ సంస్థానం నుంచి డ్యామ్ ఉన్న ప్రదేశాన్ని 999 సంవత్సరాలకు లీజుకు తీసుకుని నిర్మించింది. డ్యామ్ వెనుక భాగంలో సొరంగ మార్గాన్ని ఏర్పాటు చేసి, దాని ద్వారా తమిళనాడులోని వైగై నదిలోకి నీటిని సరఫరా చేస్తున్నారు. దీని ద్వారా 68 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నారు.



కేరళ వాదన: 120 సంవత్సరాల క్రితం నిర్మించిన డ్యామ్ భద్రత గురించి కేరళ అభ్యంతరాలను తెలియజేస్తోంది. ఇది తెగిపోతే దిగువన ఉన్న ఇడుక్కీ డ్యామ్, పెరియార్ బ్యారేజ్‌లు ప్రమాదంలో పడతాయి. కనుక, ప్రస్తుతమున్న డ్యామ్‌ని కూల్చివేసి, కొత్త డ్యామ్ నిర్మించాలి. అది కూడా ప్రస్తుత 142 అడుగుల ఎత్తు కాకుండా 136 అడుగుల ఎత్తు మాత్రమే నిర్మించాలని వాదిస్తోంది.

తమిళనాడు ప్రభుత్వ వాదన: 2010లో డ్యామ్ భద్రతపై పరిశీలన కోసం ఏ.ఎస్.ఆనంద్ కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీ డ్యామ్ భద్రతకు ఎలాంటి ప్రమాదం లేదని పేర్కొంది. 136 అడుగుల నుంచి 142 అడుగుల వరకు నీటిని నిల్వ చేసుకోవచ్చని స్పష్టం చేసింది.

పాలార్ నది వివాదం

పెన్నా, కావేరీ నదుల మధ్యలో కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు ద్వారా స్వతంత్రంగా ప్రవహించే మధ్యస్థ నది. ఈ నది తమిళనాడులోని వెల్లూరు, కంచి ప్రాంతాలకు జీవనాధారం. ఈ నదిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చిత్తూరు జిల్లా కుప్పం వద్ద డ్యామ్ నిర్మాణం ప్రారంభించింది. దీనిని తమిళనాడు వ్యతిరేకిస్తోంది.



వి. వెంకట్‌రెడ్డి,
సీనియర్ ఫ్యాకల్టీ

సింధూనది జలాల ఒప్పందం

1960లో సింధూజలాల ఒప్పందం ఇండియా - పాకిస్థాన్ మధ్య జరిగింది. దీని ప్రకారం పశ్చిమ నదులైన- సింధూ, జీలం, చీనాబ్ నదులలోని మొత్తం నీటి ప్రవాహంలో 80 శాతం పాకిస్థాన్‌కి, 20 శాతం ఇండియాకి కేటాయించారు. తూర్పు నదులైన రావి, సట్లెజ్, బియాస్ నదులలో మొత్తం నీటిలో 80 శాతం ఇండియాకి, 20 శాతం పాకిస్థాన్‌కి కేటాయించారు.

బాగ్లీహార్: ఈ ప్రాజెక్టును సింధూ ఒప్పందానికి వ్యతిరేకంగా చీనాబ్ నదిపై భారత్ నిర్మించింది. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి వ్యతిరేకంగా ప్రపంచ బ్యాంక్‌లో పాకిస్థాన్ ఫిర్యాదు చేసింది. ఫలితంగా ఈ ప్రాజెక్టు పరిశీలన కోసం లఫైతే(స్విట్జర్లాండ్) కమిటీని నియమించారు. 2010లో ఈ వివాదం పరిష్కారమైంది.

కిషన్ గంగా: ఈ ప్రాజెక్టును సింధూ ఒప్పందానికి వ్యతిరేకంగా జీలం, కిషన్ గంగా నదుల ఆధారంగా నిర్మించారు. ఈ నిర్మాణానికి వ్యతిరేకంగా అంతర్జాతీయ న్యాయస్థానంలో పాకిస్థాన్ ఫిర్యాదు చేసింది. ఫలితంగా ఈ ప్రాజెక్టు పరిశీలనకు స్విబెల్ కమిటీ(బ్రిటన్)ని నియమించారు.

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్‌ఎల్ https://ejyothy.com/UWKOdquలో చదవండి.

సీయూఈటీ(యూజీ) 2024

దేశవ్యాప్తంగా ఉన్న సెంట్రల్ యూనివర్సిటీలు సహా పార్టిసిపేటింగ్ యూనివర్సిటీలు, డీమ్డ్ యూనివర్సిటీలు, అటానమస్ కళాశాలలు, ప్రభుత్వ/ ప్రైవేట్ యూనివర్సిటీలు అందిస్తున్న అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలకు ఉద్దేశించిన 'కామన్ యూనివర్సిటీ ఎంట్రెన్స్ టెస్ట్(సీయూఈటీ) యూజీ 2024 నోటిఫికేషన్ వెలువడింది.

ఈ పరీక్షని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్వహిస్తుంది. హిందీ, ఇంగ్లీష్, తెలుగు, ఉర్దూ సహా మొత్తం 13 మాధ్యమాల్లో పరీక్ష రాయవచ్చు. ఒక జనరల్ టెస్ట్ పేపర్, 33 లాంగ్వేజ్ టెస్ట్ పేపర్లు, 27 డొమైన్ సబ్జెక్ట్ పేపర్ల నుంచి అభ్యర్థులు కనిష్ఠంగా మూడు, గరిష్ఠంగా ఆరు టెస్ట్ పేపర్లు రాసే వీలుంది.

డొమైన్ సబ్జెక్టులు

అకౌంటెన్సీ/బుక్ కీపింగ్, అగ్రికల్చర్, ఆంత్రోపాలజీ, బయాలజీ/బయలాజికల్ స్టడీస్/బయోటెక్నాలజీ/బయో కెమిస్ట్రీ, బిజినెస్ స్టడీస్, కెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్, కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మాటిక్స్ ప్రాక్టీసెస్, ఎకనామిక్స్/ బిజినెస్ ఎకనామిక్స్, ఇంజనీరింగ్ గ్రాఫిక్స్, ఆంత్రప్రెన్యూర్‌షిప్, ఫైన్ ఆర్ట్స్/ విజువల్ ఆర్ట్స్/కమర్షియల్ ఆర్ట్, జాగ్రఫీ/జియాలజీ, హిస్టరీ, హోం సైన్స్, నాలెడ్జ్ ట్రెడిషన్ ప్రాక్టీసెస్ ఇన్ ఇండియా, లీగల్ స్టడీస్, మాస్ మీడియా/మాస్ కమ్యూనికేషన్, మేథమెటిక్స్/అప్లయిడ్ మేథమెటిక్స్, పర్ఫార్మింగ్ ఆర్ట్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్/నేషనల్ క్యాడెట్ కోర్/యోగా, ఫిజిక్స్ పొలిటికల్ సైన్స్, సైకాలజీ, సంస్కృతం, సోషియాలజీ, టీచింగ్ ఆప్టిట్యూడ్. వీటికి తోడు ఇంగ్లీష్, హిందీ, తెలుగు, ఉర్దూ తదితర సబ్జెక్టులు కూడా ఉన్నాయి

అర్హత

గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు/చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్న వారు దరఖాస్తు చేసుకోవచ్చు. వయోపరిమితి నిబంధనలు లేవు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** మూడు సబ్జెక్టుల వరకు జనరల్ అభ్యర్థులు రూ.1000; ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు రూ.900; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.800; విదేశీ అభ్యర్థులు రూ.4500 చెల్లించాలి. ప్రతి అదనపు సబ్జెక్టుకు జనరల్ అభ్యర్థులు రూ.400; ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు రూ.375; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.350; విదేశీ అభ్యర్థులు రూ.1800 చెల్లించాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 26
- **వెబ్‌సైట్:** www.nta.ac.in, https://exams. nta.ac.in/CUET-UG/

ఎగ్జామ్ వివరాలు

దీనిని హైబ్రిడ్ మోడ్(కంప్యూటర్ బేస్డ్ టెస్ట్/పెన్&పేపర్ టెస్ట్)లో నిర్వహిస్తారు. అన్నీ మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలే ఇస్తారు. ఇందులో మూడు సెక్షన్‌లు ఉంటాయి. మొదటి సెక్షన్‌లో లాంగ్వేజ్ టెస్ట్‌లు ఉంటాయి. రీడింగ్ కాంప్రహెన్షన్, లిటరరీ ఆప్టిట్యూడ్, ఒకాబులరీలకు సంబంధించి 50 ప్రశ్నలు ఇస్తారు. వీటిలో 40 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి. రెండో సెక్షన్‌లో డొమైన్ సబ్జెక్ట్ టెస్ట్‌లు ఉంటాయి. ఇంటర్/పన్నెండోతరగతి సిలబస్ ఆధారంగా 50 ప్రశ్నలు అడుగుతారు. వీటిలో 40 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి. మూడో సెక్షన్‌లో జనరల్ టెస్ట్ ఉంటుంది. ఇందులో జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్, జనరల్ మెంటల్ ఎబిలిటీ, న్యూమరికల్ ఎబిలిటీ, క్వాంటిటేటివ్ రీజనింగ్, లాజికల్ అండ్ అనలిటికల్ రీజనింగ్ అంశాలనుంచి 60 ప్రశ్నలు ఇస్తారు. వీటిలో 50 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి. ప్రశ్నకు అయిదు మార్కులు కేటాయించారు. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు.

అభ్యర్థులు జనరల్ టెస్ట్ సహా డొమైన్ సబ్జెక్టుల నుంచి 4 లేదా 5 పేపర్లు; లాంగ్వేజ్ సబ్జెక్టుల నుంచి 1 లేదా 2 పేపర్లు చొప్పున గరిష్ఠంగా 6 పేపర్లు ఎంచుకోవాలి. జనరల్ టెస్ట్ సహా కనీసం ఒక లాంగ్వేజ్ ఉండేలా చూసుకోవాలి.

మేథమెటిక్స్/అప్లయిడ్ మేథమెటిక్స్, అకౌంటెన్సీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఎకనామిక్స్, కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మాటిక్స్ ప్రాక్టీసెస్, జనరల్ టెస్ట్ పేపర్లకు ఒక్కోదానికి పరీక్ష సమయం ఒక గంట. మిగిలిన అన్ని పేపర్లకూ ఒక్కోదానికి 45 నిమిషాలు ఇస్తారు.



నారా లోకేశ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

పెమ్మసాని కుటుంబంతో ఎన్నో ఏళ్ల అనుబంధం

- కష్టపడి పనిచేయటం, వెనకడుగు వేయనితత్వం ఆయన నైజం
- టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్

మంగళగిరి, ఫిబ్రవరి 28: పెమ్మసాని కుటుంబంతో తెలుగుదేశం పార్టీకి ఎన్నో ఏళ్లుగా అనుబంధం వుందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చెప్పారు. ఉండవల్లిలోని నివాసంలో బుధవారం టీడీపీ నేతలతో ఏర్పాటు చేసిన పరిచయ కార్యక్రమానికి టీడీపీ గుంటూరు పార్లమెంటు నేత డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ కష్టపడి పనిచేయడంలో పెమ్మసాని వెనుకడుగు వేసే వ్యక్తి కాదన్నారు. పనిచేసే వ్యక్తికి ప్రోటోకాల్‌తో పనిలేదని, తనకు పార్టీపరంగా గ్రౌండ్‌వర్క్ చేయడమంటే ఎంతో ఇష్టమన్నారు. పెమ్మసాని మాట్లాడుతూ రాష్ట్రంలో కుప్పం, మంగళగిరి నియోజకవర్గాలు ఎంతో అదృష్టం చేసుకున్నాయని చెప్పారు. ఎన్నో చోట్ల పోటీ చేసే అవకాశం వున్నా లోకేశ్ మంగళగిరి నియోజకవర్గాన్నే ఎంచుకోవడం ఈప్రాంత ప్రజల అదృష్టమన్నారు. చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్, భవిష్యత్తుకు గ్యారెంటీ హామీలను ప్రతి ఇంటికీ చేర్చాలని పిలుపునిచ్చారు. మంగళగిరి నుంచి లోకేశ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు పార్టీశ్రేణులు కృషిచేయాలని పెమ్మసాని కోరారు.



టీడీపీలో చేరిన వైసీపీ మైనార్టీ నేతలతో నారా లోకేశ్, పెమ్మసాని చంద్రశేఖర్

లోకేశ్ సమక్షంలో టీడీపీలోకి భారీగా చేరికలు ..

మంగళగిరి నియోజకవర్గంలో వైసీపీ నేతలు ఒక్కొక్కరుగా ఆ పార్టీని వీడుతున్నారు. వైసీపీకి రాజీనామా చేస్తున్న నేతలు యువనేత నారా లోకేశ్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకుంటున్నారు. తాజాగా, వైసీపీ యువజన విభాగం మంగళగిరి పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ సుభానీ, మరో 60 కుటుంబాలు బుధవారం టీడీపీలో చేరాయి. ఉండవల్లి లోని నివాసంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సమక్షంలో పసుపు కండువా కప్పుకున్నారు. లోకేశ్ వీరికి పార్టీ కండువాలనుకప్పి సాదరంగా ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలని, వైసీపీ దుశ్చర్యలను, వైఫల్యాలను ప్రజలకు తెలియజేయాలని లోకేశ్ వారికి సూచించారు. కార్యక్రమంలో టీడీపీ గుంటూరు పార్లమెంటు నేత పెమ్మసాని చంద్రశేఖర్, టీడీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు పడవల మహేష్ పాల్గొన్నారు.

పసుపు.. మిలమిల

- రికార్డు స్థాయిలో పసుపు దిగుబడులు
- ఎకరాకు 300 బస్తాల దిగుబడి వచ్చిందంటున్న రైతులు



అరకతో పసుపు దున్నుతున్న కూలీ .

కొల్లూరు, ఫిబ్రవరి 28: ఓ రైతు రికార్డు స్థాయిలో పసుపు దిగుబడులు సాధించాడు. కొల్లూరు మండలంలోని పోతార్లంక గ్రామానికి చెందిన ఈడ్పుగంటి కుటుంబరావు ఐదెకరాల విస్తీర్ణంలో పసుపు సాగు చేశాడు. మునుపెన్నడూ చూడని విధంగా పసుపు కొమ్ములు ఊరడంతో అత్యధిక దిగుబడులు వస్తున్నాయని చెబుతున్నాడు. సేలం పసుపు విత్తనాన్ని ఎకరాకు సుమారు పది క్వింటాళ్ల వరకు విత్తానని, ఎకరాకు లక్షన్నర నుంచి రెండు లక్షల వరకు పంటపై పెట్టుబడులు పెట్టానని అన్నారు. ఒక్కో ఎకరాకు 75 కిలోల బస్తా చొప్పున 300 బస్తాల పసుపు వచ్చినట్లు పేర్కొన్నారు. పచ్చి పసుపు వండిన అనంతరం ఎకరాకు 50 క్వింటాళ్ల దిగుబడి ఆశిస్తున్నట్లు చెప్పారు. అరకతో దున్నగా వచ్చిన పసుపును పోగు చేసేందుకు రోజు 70మంది కూలీలు అవసరమైనట్లు ఆయన తెలిపారు. గతంలో క్వింటా పసుపు రూ.5 నుంచి రూ.7 వేలు వరకు ధర పలుకగా, ప్రస్తుతం వండిన పసుపు క్వింటా రూ.12 వేలకు వ్యాపారులు యార్డులో కొనుగోలు చేస్తున్నారన్నారు. భవిష్యత్‌లో పసుపు ధర రూ.15 వేలు వరకు కూడా పలుకుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

గతం కంటే అధిక దిగుబడులు...

కొల్లూరు మండలంలోని లంక గ్రామాల్లో ఈ ఏడాది పసుపు సాగు చేసిన రైతులు అధిక దిగుబడులు పొందుతున్నారు. గతంలో ఎకరాకు 20 నుంచి 30 క్వింటాళ్ల దిగుబడి రాగా, ప్రస్తుతం చేస్తున్న పసుపు తవ్వకాల్లో కొమ్ములు బాగా ఊరడంతో ఎకరాకు 30 క్విం టాళ్ల పైనే దిగుబడి రావచ్చని రైతులు చెబుతున్నారు. గతంలో పసుపు సాగుచేసి దెబ్బతిన్న రైతులు ఈఏడాది దిగుబడులపరంగా, ధర పరంగా కూడా ఆశాజనకంగా ఉండటంతో గతంలో పంటలపై పెట్టిన పెట్టుబడుల రుణాలను తీర్చుకునే విధంగా పసుపు దిగుబడులు వస్తున్నాయని పసుపు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.





దున్నిన పసుపును ఏరుతున్న కూలీలు , రైతు కుటుంబరావు (ఇన్‌సెట్లో)

చీరలిస్తాం.. ఓటెయ్యండి..

రాజుపాలెం, ఫిబ్రవరి 28: ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే ఓటర్లకు తాయిలాలు పంచే కార్యక్రమానికి వైసీపీ నేతలు తెర తీశారు. పల్నాడు జిల్లా రాజుపాలెం మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో రెండు రోజుల కిందట వైసీపీ ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరి, స్థానిక వైసీపీ నాయకులు వేల్పుల వెంకటేశ్వర్లు, స్థానిక వలంటీరుతో కలిసి చీరల పంపిణీకి సిద్ధపడ్డారు. ఇంటికో చీర ఇస్తామంటూ దాదాపు వెయ్యి చీరలను తీసుకుని తిరిగారు. కొందరు ఓటర్లు ఈ చీరలను తీసుకోగా టీడీపీ వర్గీయులు మాత్రం వాటిని తీసుకునేందుకు నిరాకరించారు. మాకు వద్దు అని గట్టిగా చెప్పటంతో అధికార పార్టీ నేతలు జారుకున్నారు.

చిరువ్యాపారులకు..
ఆశీలు ఫీజు రద్దు చేస్తాం

- టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్
- మంగళగిరిలో యూరో కార్టు సేవలకు శ్రీకారం
- 50 మంది చిరు వ్యాపారులకు కార్టులు పంపిణీ



యూరో కార్ట్ ట్రైనింగ్ మాడ్యూల్‌ను ఆవిష్కరిస్తున్న లోకేశ్ తదితరులు

మంగళగిరి, ఫిబ్రవరి 28: టీడీపీ-జనసేన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చిరువ్యాపారులకు ఆశీలు ఫీజును రద్దు చేస్తామని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ హామీ ఇచ్చారు. మంగళగిరి నియోజకవర్గంలో చిరువ్యాపారుల జీవనోపాధికి వివిధ రూపాల్లో చేయూతనిస్తున్న యువనేత లోకేశ్ మరో ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. చిరువ్యాపారుల ఆదాయాన్ని కనీసం 50 శాతం పెంచే దిశగా ఎన్నారై టీడీపీ సహకారంతో అధునాతన యూరో కార్టు సేవలను బుధవారం ప్రారంభించారు. రోడ్లవెంబడి టిఫిన్ బండ్లపై వ్యాపారం చేసుకునే చిరువ్యాపారులకు పాశ్చాత్య దేశాల్లో మాదిరి అధునాత సదుపాయాలతో కూడిన యూరో కార్టులను అందజేశారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ సీఎం జగన్ సంక్షేమం పేరిట కుడిచేత్తో రూ.పది ఇచ్చి.. ఎడమ చేత్తో రూ.వంద లాగేస్తున్నారని విమర్శించారు. వీధి వ్యాపారులకు వడ్డీలేని రుణాల పేరుతో రూ.పది వేలు ఇస్తూ.. అదే సమయంలో ఆశీలు పేరుతో ఏటా రూ.10,800 దోచేస్తున్నారని ఆరోపించారు. చిరువ్యాపారులు ఎక్కడైతే రోజువారీ బండ్లు పెట్టుకుని జీవనం సాగిస్తున్నారో వారికి అక్కడే లైసెన్సులు ఇచ్చి పోలీసు వేధింపులు లేకుండా చేస్తామన్నారు. బండ్ల వద్ద చెత్తను మునిసిపాలిటీల ద్వారా సేకరించే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. యూరో కార్టులు పొందిన లబ్ధిదారులకు బ్యాంకు ద్వారా వర్కింగ్ క్యాపిటల్ సమకూరుస్తున్నందున అడ్డగోలు వడ్డీల బెడద వుండదన్నారు. శుభ్రత విషయంలో వెస్టిన్ హోటల్ మేనేజ్‌మెంట్ వారిచే 5స్టార్ హోటళ్లకు ధీటుగా శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య, ఎన్నారై టీడీపీ ప్రతినిధులు గుంటుపల్లి జయకుమార్, మురళీ రాపర్ల, యూరో కార్ట్ డిజైనర్ కృష్ణంరాజు, వెస్టిన్ ట్రైనర్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యూరోకార్టు ప్రత్యేకతలెన్నెన్నో..

అధునాతనంగా రూపొందించిన యూరోకార్టులు తేలికగా శుభ్రం చేసుకోవడానికి అనువుగా వుంటాయి. శుభ్రత విషయంలో స్టార్ హోటళ్లకు దీటుగా వెస్టిన్ హోటల్ మేనేజ్‌మెంట్ స్కూల్ తరఫున చిరువ్యాపారులకు ఉచితంగా శిక్షణ ఇస్తారు. చిరువ్యాపారులకు అవసరమైన రోజువారీ సరుకులను ఆర్డర్‌పై వేర్వేరు బ్రాండెడ్ స్టోర్స్ వారు బండి వద్దకే పంపేలా ఏర్పాట్లు చేశారు. ఈ లావాదేవీలకు అవసరమైన బ్యాంకు సేవలను హెచ్‌డీఎఫ్‌సీ వారు అందిస్తారు. రోజువారీ వ్యాపారం ద్వారా వచ్చే ఆదాయంతోపాటు యూరోకార్టు స్క్రీన్‌పై ప్రకటనల ద్వారా కూడా మరికొంత ఆదాయం పొందే అవకాశం వుంది. ఎన్నారై టీడీపీ ప్రతినిధులు గుంటుపల్లి జయకుమార్, మురళీ రాపర్ల సహకారంతో ఈ పైలట్ ప్రాజెక్టును బుధవారం ఉండవల్లిలోని నివాసం వద్ద నారా లోకేశ్ లాంఛనంగా ప్రారంభించారు. చిరువ్యాపారుల ఆదాయంతోపాటు జీవన ప్రమాణాలు పెంచేందుకు ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. పైలట్ ప్రాజెక్టు విజయవంతమైతే రాబోయే ప్రజా ప్రభుత్వంలో రాష్ట్రం మొత్తం విస్తరించాలని భావిస్తున్నట్టు లోకేశ్ తెలిపారు. తొలి దశలో భాగంగా మంగళగిరి నియోజకవర్గంలో 50 మంది మహిళలకు శిక్షణ ఇచ్చి యూరో కార్టులు అందించారు. వారిలో కొంత మంది లబ్ధిదారులకు బుధవారం లోకేశ్ చేతుల మీదుగా యూరోకార్టులను అందజేశారు.

టీడీపీ, వైసీపీ వర్గీయుల బాహాబాహీ

- ఫ్లెక్సీల ఏర్పాటుపై చెలరేగిన వివాదం
- ఎనిమిది మందికి గాయాలు

మాచర్ల, ఫిబ్రవరి 28: ఫ్లెక్సీల ఏర్పాటుపై చెలరేగిన వివాదంలో టీడీపీ, వైసీపీ వర్గీయులు బాహాబాహీకి దిగారు. ఒకరిపై ఒకరు కర్రలు, రాడ్లతో దాడికి దిగడంతో ఇరువర్గాలకు చెందిన 8 మందికి గాయాలయ్యాయి. ఈ ఘటన మాచర్ల పట్టణంలో జరిగింది. పట్టణంలోని తూర్పు బావి జెండా చెట్టు ప్రాంతంలో బుధవారం సాయంత్రం బాబు షూరిటీ - భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించేందుకు పార్టీ నేతలు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా మధ్యాహ్న సమయంలో టీడీపీ నేతలు ఆ ప్రాంతంలో తమ పార్టీ ఫ్లెక్సీలు, జెండాలు, తోరణాలు ఏర్పాటు చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఈ సమయంలో వైసీపీ నేతలు ఆ ఫ్లెక్సీలను చించారు. ఈ క్రమంలో టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య వివాదం చెలరేగింది. అనంతరం ఒకరిపై ఒకరు కర్రలు, రాడ్లతో దాడులు చేసుకున్నారు. ఈ ఘటనలో టీడీపీకి చెందిన మోసిన్, ముజుఫర్, నాసిర్, జానిలకు గాయాలు కాగా వైసీపీకి చెందిన అహ్మద్, నాగుల్‌మీరా, యూసుఫ్, అంగర్‌బాషాలకు గాయాలయ్యాయి. గాయపడిన వైసీపీ నేతలను మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కాగా టీడీపీ నేతలు గురజాల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. పట్టణ సీఐ శరత్‌బాబు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు.

వైసీపీ నేతలు ధర్నా... దాడిని ఖండిస్తూ ఆ పార్టీ నేతలు పట్టణంలోని పార్కు సెంటర్ వద్ద ధర్నాకు దిగారు. దాడికి పాల్పడిన టీడీపీ నేతలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న పట్టణ సీఐ శరత్‌బాబు అక్కడకు చేరుకొని ఆందోళనకారులతో మాట్లాడారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీనివ్వడంతో వైసీపీ నేతలు ధర్నా విరమించారు.

ప్రజాదరణ ఓర్వలేకే చిచ్చు

- టీడీపీ నేతలపై అసత్యపు ప్రచారం
- టీడీపీ మాచర్ల నియోజకవర్గ అభ్యర్థి బ్రహ్మారెడ్డి

మాచర్ల, ఫిబ్రవరి 28: టీడీపీకి వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక వైసీపీ నేతలు పట్టణంలోని ముస్లిం గడ్డపై చిచ్చు పెట్టాలని చూస్తున్నారని టీడీపీ నియోజకవర్గ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని తూర్పుబావి జెండా చెట్టు వద్ద జరిగిన ఘర్షణపై స్పందించారు. మండల కేంద్రమైన వెల్దుర్తిలోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జెండా చెట్టు వద్ద జరిగిన ఘర్షణలో టీడీపీ నేతలు దాడి చేశారని అధికార పార్టీ నేతలు అసత్యపు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అబద్ధాలు ఆడడంలో స్థానిక ఎమ్మెల్యే పీఆర్కే ఘనపాటి అని, పల్లెటూరు నుంచి వచ్చి దాడి చేశారని ప్రచారం గావిస్తున్నారని, ఆ ఘర్షణలో పల్లెటూరు వాళ్లు ఎవరున్నారో రుజువు చేయాలన్నారు. టీడీపీకి వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక మసీదు సెంటర్లో కర్రలు దాచిపెట్టి దాడి చేశారన్నారు. పథకం ప్రకారం తమ పార్టీ నేతలపై దాడి చేశారని, లేకుంటే మసీదుకు వెళ్లే వారు కర్రలు, కత్తులతో వస్తారా అని ప్రశ్నించారు. తమ పార్టీ శ్రేణులపై తప్పుడు కేసులు పెడితే పోలీసు శాఖపై కోర్టుకు వెళ్తామని హెచ్చరించారు.



టీవీలో వీడియో చూపుతూ మాట్లాడుతున్న టీడీపీ మాచర్ల ఇన్‌చార్జి బ్రహ్మారెడ్డి

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.90
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	150, 159,170
చికెన్ విత్ స్కిన్	290.00
చికెన్ స్కిన్ లెస్	300.00

అధర్మం నాలుగు పాదాల మీద నడక

- మచిలీపట్నం ఎంపీ, జనసేన నేత బాలశౌరి



గుంటూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పరిపాలనలో అధర్మం నాలుగు పాదాల మీద నడుస్తున్నదని మచిలీపట్నం ఎంపీ, జనసేన నేత వల్లభనేని బాలశౌరి ఆరోపించారు. ఎక్కడ చూసినా అధర్మం, అన్యాయం, అక్రమం రాజ్యమేలుతున్నాయి. ఆ పార్టీ నుంచి ఎంపీలు, ఎమ్మెల్యేలు బయ టకు వస్తుండటానికి ప్రధాన కారణాలు ఇవేనన్నారు. ఎవరైనా ఏదైనా మాట్లాడితే వెంటనే వాళ్ల మీద ఎదురుదాడికి దిగడం, నేతలతో తిట్టించడం పరిపాటైపోయిందన్నారు. బుధవారం గుంటూరు నుంచి తన అనుచరులతో కలిసి తాడేపల్లిగూడెం జెండా బహిరంగ సభకు ఆయన బయలుదేరుతూ పాత్రికేయులతో మాట్లాడారు. తాడేపల్లిగూడెం సభకు మచిలీపట్నంలోని అన్ని నియోజకవర్గాల నుంచి వెయ్యి కార్లలో జనసైనికులు బయలుదేరారని చెప్పారు. వైసీపీ విముక్తిని ప్రజలు కోరుకొంటున్నారు. రాష్ట్రంలో ప్రజాస్వా మ్యం, స్వేచ్ఛ ఉండాలని ఆకాంక్షిస్తున్నారని తెలిపారు. భయాందోళనలో ఉన్న ప్రజలకు భరోస కల్పించేందుకే తాడేపల్లిగూడెంలో లక్షలాది మంది టీడీపీ, జనసేన పార్టీ కార్యకర్తలతో బహిరంగ సభ ఏర్పాటు చేశామన్నారు. వైసీపీని ఇంటికి పంపించేందుకు జనసేనాని పవన్ కల్యాణ్ ఏమి నిర్ణయం తీసుకొన్నా తామంతా కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు. వైసీపీ బాధితులంతా టీడీపీ -జనసేనకూటమితో చేతులు కలపాలని విజ్ఞప్తి చేశారు. తప్పక స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రభుత్వం ఏర్పాటు చేసుకొందామన్నారు. ఎన్నికల సమయంలో సీట్లపంపిణీ సందర్భంగా ఏ పార్టీలోనైనా అసంతృప్తులు సహజమని, పోలింగ్ నాటికి అవన్నీ సర్దుకొంటాయన్నారు. ఇప్పుడు టిక్కెట్ రాలేని వారికి భవిష్యత్తులో రాజ్యసభ, ఎమ్మెల్సీ, కార్పొరేషన్ల ఛైర్మన్, ఇతర నామినేటెడ్ పదవులు కల్పించి తగినరీతిలో గౌరవిస్తామని చెప్పారు. రాష్ట్రంలో అభివృద్ధి అనేదిలేదు. పోలవరం ప్రాజెక్టుని గత ప్రభుత్వం 75 శాతం నిర్మిస్తే వైసీపీ ఐదేళ్లలో కనీసం 5శాతం కూడా నిర్మాణం చేయలేదు. అసలు ఆ ప్రాజెక్టుని ఎలా పూర్తి చేయాలనే నిర్ణయమే తీసుకోలేదు. తాను జలజీవన్ మిషన్ కింద కేంద్రం నుంచి మచిలీపట్నంకు రూ.200 కోట్లు తీసుకొస్తే కనీసం మ్యాచింగ్ గ్రాంటుని వైసీపీ ప్రభుత్వం ఇవ్వలేదన్నారు. వైసీపీని ఇంటికి పంపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, ఇందులో ఎలాంటి అనుమానం లేదని చెప్పారు. తాను మచిలీపట్నం నుంచి తిరిగి గెలిచి రాబోయే ఐదేళ్లలో బందరు - రేపల్లె రైల్వే లైను, గుడివాడ - కంకిపాడు గ్రీన్‌ఫీల్డ్ హైవే తదితర ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు కృషి చేస్తానన్నారు.

జగన్ మాట తప్పాడు.. మడమ తిప్పాడు

- మద్యం ఆదాయంలో రూ.లక్ష కోట్లు దోచేసిన సీఎం
- రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్



రేపల్లె, ఫిబ్రవరి 28: మద్యనిషేధం అమలు చేసిన తర్వాతే ప్రజలను ఓట్లు అడుగుతానని చెప్పిన జగన్ రెడ్డి ఆ హామీ అమలులో మాట తప్పాడని, మడమ తిప్పాడని రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో అన్నారు. రాష్ట్రంలో మద్యం రేట్లు మూడు రెట్లు పెంచారని, సీఎం జగన్‌రెడ్డి 57 నెలల పాలనా కాలంలో సుమారు రూ.2 లక్షల కోట్లు విలు వైన నాసిరకం మద్యం అమ్మి రూ.1 లక్ష కోట్లు ఆదాయాన్ని తాడేపల్లి ప్యాలెస్‌కు తరలించాడని ఆరోపించారు. రాష్ట్రంలో నాసిరకం మదం తాగి 30 వేల మంది ప్రాణాలు కోల్పోగా, దాదాపు 30 లక్షల మంది ఆరోగ్యాలు దెబ్బతిని ఆస్పత్రుల పాలయ్యారన్నారు. నాసిరకం మద్యం, గంజాయి, మాదకద్రవ్యాల బారినపడిన యువత అన్యా యమై పోతున్నారన్నారు. అత్యాచారాలు, నేరాలు, భారీగా పెరిగాయన్నారు. రాబోయే 15 ఏళ్ల పాటు మద్యం ద్వారా వచ్చే ఆదాయాన్ని తాకట్టు పెట్టి రూ.40వేల కోట్లు అప్పు తెచ్చి సీఎం జగన్‌రెడ్డి తాడేపల్లి ప్యాలెస్‌లో దాచారని ఆరోపించారు. ప్రభుత్వ మద్యంషాపుల్లో నగదు లావాదేవీలు మాత్రమే చేస్తున్నారని, డిజిటల్ చెల్లింపులు ఎందుకు చేయటంలేదని ప్రశ్నించారు. నాసిరకం మద్యం అమ్మకాల్లో సీఎం జగన్ ఒక్కడే రూ.లక్ష కోట్ల కమీషన్ కొట్టివేశాడని, మిగతా వైసీపీ నేతలు వేల కోట్ల రూపాయలు దోచేశారన్నారు. ఈ దందా అంతా జగన్, విజయసాయిరెడ్డి సిండికేట్ ద్వారానే జరుగుతుందన్నారు. నాసిరకం మద్యం పోవాలంటే, మహిళల మాంగాల్యాలు నిలవాలంటే రానున్న ఎన్నికల్లో వైసీపీని ఓడించాలని, టీడీపీ - జనసేన కూటమిని గెలిపించాలని అనగాని ప్రజలను కోరారు.



తుళ్లూరు రైతు ధర్నా శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు రైతులు

వైసీపీ పాలనలో అంతా దగాయే !

- రాజధానికి భూములిచ్చిన రైతులను మోసం చేసిన జగన్‌రెడ్డి
- 1534 వ రోజుకు చేరుకున్న రైతుల ఆందోళనలు

తుళ్లూరు ఫిబ్రవరి 28: వైసీపీ పాలనలో అంతా దగాయేనని రాజధాని అమరావతికి 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు ఆరోపించారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్, అంటూ రైతులు, రైతు కూలీలు మహిళలు చేస్తున్న ఆందోళనలు బుధ వారం నాటికి 1534వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి పలువురు మాట్లాడుతూ.. రాష్ట్రానికి మూడు రాజధానులు వద్దు, అన్ని వర్గాల ప్రజలు అమరావతినే రాజధానిగా కోరుకుంటున్నారని స్పష్టం చేశారు. అవరావతిని నిర్వీర్యం చేయాలనే సీఎం జగన్‌రెడ్డి దుశ్చర్యను దేశం మొత్తం ఖండించిందన్నారు. దేశంలో ఏ రాష్ట్రానికి మూడు రాజధానులు ఉన్నాయో జగన్‌రెడ్డి చెప్పాలన్నారు. రాష్ట్రానికి ప్రయోజనం కలిగించే ఏ పని ఆయన చేయలేదన్నారు. దీంతో అభివృద్ధిలో రాష్ట్రం 20 ఏళ్లు వెనకబడిపోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. రాజధాని అమరావతి విషయంలో వైసీపీ ప్రభుత్వానికి ఉన్నత న్యాయస్థానం ఎన్నిసార్లు మొట్టికాయలు వేసిన సిగ్గురావటం లేదన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి , జై అమరావతి అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాలతో పాటు మంగళగిరి, తాడికొండ నియోజకవర్గాలలో ఆందోళనలు కొనసాగాయి.

మహిళా కౌలు రైతు ఆత్మహత్య

- అప్పుల బాధ తాళలేక ఉరివేసుకున్న వైనం

పెదనందిపాడు, ఫిబ్రవరి 28: మండలంలోని రావిపాడులో అప్పుల బాధతో ఓ మహిళా కౌలురైతు బుధవారం ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన గుంటూరు సామ్రాజ్యం(43) కూలి పనులు చేసుకుంటూ ఉండేది, గతంలో 5 ఎకరాలు పొలం కౌలుకు తీసుకొని మిరప పంట సాగు చేశారు. సరైన దిగుబడి లేక అప్పులపాలవగా ఈ ఏడాది ఒక ఎకరం మాత్రమే కౌలుకు తీసుకొని మిర్చి పంట సాగు చేసింది. భారీ వర్షాలకు, తామర పురుగు బెడదతో పంట పూర్తిగా దెబ్బతినడంతో వీకేసి పొగాకు సాగు చేశారు. తెచ్చిన అప్పులు తీరుతాయో లేదోనని మనోవేదనకు గురై వేకువజామున ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. భర్త ఇంటికి వచ్చి చూడగా అప్పటికే మృతిచెందినట్లు గుర్తించారు. సంఘటనా స్థలానికి ఎస్‌ఐ రాజకుమార్ చేరుకొని వివరాలు సేకరించారు. భర్త సుబ్బారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

1,39,349 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 1,16,503 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 1,39,349 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 96,590 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	8000	20000
నెంబరు. 5	12000	17000
273	9000	19500
341	8500	20500
4884	8500	17800
సూపర్ 10	11500	19000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	21000
బ్యాడిగి	10500	20000
దేవనూరు డీలక్స్	10000	20000
తెల్లకాయలు	5000	12500

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట



ధర్నా చేస్తున్న మునిసిపల్ కార్మికులు

మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని ధర్నా

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 28: విధి నిర్వహణలో ట్రాక్టర్ ఢీకొని మృతి చెందిన మునిసిపల్ కార్మికుడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మునిసిపల్ కార్మికులు బుధవారం ఉదయం మునిసిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. నరసరావుపేట మునిసిపాలిటీలోని పారిశుధ్య కార్మికుడు దేవంగి కోటయ్య ఈ నెల 17న విధి నిర్వాహణలో ట్రాక్టర్ ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. కోటయ్య చికిత్స పొందుతూ ఈ నెల 27న మృతిచెందాడు. ఈ నేపథ్యంలో మృతుని కుటుంబానికి రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియో ప్రకటించాలని, అతని భార్యకు మునిసిపాలిటీలో శాశ్వత ఉద్యోగం ఇప్పించాలని, రెండు సెంట్ల ఇంటి స్థలాన్ని ఇప్పించాలని, ట్రాక్టర్ డ్రైవర్‌ను విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ, ఏఐటీయూసీ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో యోహాన్, డేవిడ్, రాజా, శ్రీదేవి, విజయలక్ష్మి, శిలార్, సాల్మన్, మల్లయ్య వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

6వ తేదీకి తిరునాళ్ల ఏర్పాట్లు పూర్తిచేయాలి

● ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

కోటప్పకొండ (నరసరావుపేట), ఫిబ్రవరి 28: తిరునాళ్ల ఏర్పాట్లను మార్చి 6వ తేదీ నాటికి పూర్తిచేయాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన తిరునాళ్ల ఏర్పాట్లను పరిశీలించారు. కోటప్పకొండ వద్ద జరుగుతున్న పనులను త్వరతగతిన పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ మల్రాజు రామకృష్ణ కొండలరావు, ఆలయ ఈవో జీ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఎన్ కళాశాలలో డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 28: స్థానిక ఎస్ఎస్ఎన్ కళాశాల ఆడిటోరియంలో నరసరావుపేట పోస్టల్ డివిజన్ ఎస్‌పీ పీ వెంకటస్వామి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఆర్‌పీఎల్ఐ డెత్ క్లైయిమ్స్‌కు సంబంధించిన చెక్‌లను అసిస్టెంట్ డైరెక్టర్ జీ సతీష్ పంపిణీ చేశారు. కే అశోక్‌బాబుకు రూ.11,27,704 చెక్కు, ఎస్.సుబ్బాయమ్మకు రూ.2,86,031లు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా జీ సతీష్ మాట్లాడుతూ పోస్టల్ ఖాతాలు ఎస్‌బీ, ఆర్‌డీ, టీడీ, సుకన్య సమృద్ధి ఖాతాలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఎస్‌పీ జీ శ్రీనివాసరావు, ఏఎస్‌పీ ఎస్‌కే ఎం.ఫాతిమా, సబ్‌డివిజనల్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

3న ఉచిత కంటి వైద్య శిబిరం

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 28: అర్వపల్లి పాండురంగారావు, రామలక్ష్మమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మార్చి 3న నరసరావుపేట పట్టణం ఎస్ఎస్ఎన్ కళాశాలలో ఉచిత కంటి వైద్య శిబిరం జరుగుతుందని ట్రస్ట్ వ్యవస్థాకుడు అర్వపల్లి నరసింహారావు బుధవారం తెలిపారు. గుంటూరు జిల్లా అంధత్వ నివారణ సంస్థ శంకర కంటి ఆసుపత్రి వైద్యనిపుణులతో నిర్వహించే ఈ వైద్య శిబిరం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు జరుగుతుందన్నారు. నేత్ర పరీక్షలు నిర్వహించి శుక్లాలు ఉన్నవారిని ఎంపికచేసి ఉచితంగా బీపీ, షుగర్ టెస్టులు నిర్వహిస్తారని చెప్పారు. కంటి పరీక్షల నిమిత్తం వచ్చేవారు రేషన్‌కార్డు/ఓటరు గుర్తింపు కార్డు/ఆధార్‌కార్డు ఏదైన ఒకటి ఫొటోస్టాట్ కాపీని తప్పనిసరిగా తీసుకురావాలన్నారు.

ఘనంగా కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో నేషనల్ సైన్స్‌డే

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 28: పట్టణంలోని కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో నేషనల్ సైన్స్‌డే వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారని ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు అన్నారు. సర్ సీవీరామన్ 1928లో రామన్ ఎఫెక్ట్ కనుగొన్నందుకుగాను 1986లో ఫిబ్రవరి 28న నేషనల్ సైన్స్‌డే జ్ఞాపకంగా భారత ప్రభుత్వం ప్రకటించిందన్నారు. కళాశాలలో సైన్స్‌డే వర్క్‌షాపును నిర్వహించారు. వర్క్‌షాపులో ఎలక్ట్రికల్ సైకిల్, డ్రోన్-ఈడ్రోన్, స్మార్ట్ డస్ట్‌బిన్, ప్లాంట్ ఇరిగేషన్, ప్రదర్శించారు. ఈ సందర్భంగా వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ డీ యేగేశ్వరరావు, వై శ్రీకాంత్, జే మల్లారెడ్డి, శ్రీదేవి, సుమలత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగన్ బొమ్మలున్న పాసు పుస్తకాలు మాకొద్దు

● రీసర్వేలో ఇస్తున్న పుస్తకాలపై రైతుల అభ్యంతరం

శావల్యాపురం, ఫిబ్రవరి 28: రీసర్వే తర్వాత ప్రభుత్వం రైతులకు ఇస్తున్న పట్టాదారు పాసు పుస్తకాలపై సీఎం జగన్ బొమ్మలుండటంతో పాసు పుస్తకాలు మాకొద్దంటూ కొందరు రైతులు తిరస్కరిస్తున్న సంఘటనలు వివిధ గ్రామాల్లో వెలుగులోకి వస్తున్నాయి. మండలంలోని కనమర్లపూడి, పోట్లూరు, వేల్పూరు, పిచికలపాలెం రెవెన్యూ గ్రామాల పరిధిలో ప్రభుత్వం చేపట్టిన రీసర్వే పూర్తయి రైతులకు పట్టాదారు పుస్తకాలు కూడా పంపిణీ చేశారు. ప్రారంభంలో ప్రభుత్వం ఇచ్చే పాసు పుస్తకాలు ఎలా ఉంటాయో తెలియక రెవెన్యూ అధికారులు అడగ్గానే పాసుపుస్తకాలలో నమోదు చేసేందుకు రైతుల ఆధారాలు సమర్పించారు. కానీ పాసు పుస్తకాలు రాగానే వాటిపై సీఎం జగన్మోహన్‌రెడ్డి ఫొటోలుండటంతో కొందరు రైతులు వాటిని తీసుకోకుండా వదిలేయడంతో రెవెన్యూ కార్యాలయంలోనే ఉండిపోయాయి. శానంపూడి రెవెన్యూ పరిధిలో ప్రస్తుతం పాసు పుస్తకాల్లో నమోదు చేసేందుకు రెవెన్యూ సిబ్బంది రైతుల వద్ద ఆధారాలు సేకరిస్తున్నారు. కొందరు రైతులు ఆధారాలివ్వడానికి నిరాకరిస్తూ మేము, మా తల్లిదండ్రులు కష్టపడి సంపాదించుకొన్న ఆస్తులపై రాజకీయ నాయకుల బొమ్మలేంటని, గతంలో ఎప్పుడూ లేనిది ఇప్పుడు కొత్తగా ఎందుకు ముద్రిస్తున్నారంటూ రెవెన్యూ సిబ్బందిని నిలదీస్తున్నారు. దాంతో రైతుల ఆధారాలు సేకరించి నమోదు చేసేందుకు తీవ్రజాప్యం జరుగుతోంది.

స్కూల్ బిల్డింగ్ పై నుంచి పడి విద్యార్థిని మృతి

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 28: ప్రైవేటు స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న కొనకండ్ల రిషిత (16) అనే విద్యార్థిని ప్రమాదవశాత్తు పాఠశాల నాల్గో అంతస్తు నుంచి కిందపడటంతో తీవ్రగాయపడి మృతిచెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. మృతురాలు కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... రిషితకు మానసికస్థితి సరిగా లేకపోవడంతో కొన్నిరోజులుగా హైదరాబాద్‌లోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స తీసుకుంటుంది.

స్టేట్‌బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

● కారుమంచి మేనేజర్ రాంబాబు

భాస్కర్‌నగర్ (శావల్యాపురం) ఫిబ్రవరి 28: స్టేట్‌బ్యాంక్‌ల ద్వారా అందిస్తున్న వివిధ రకాల సేవలను ఖాతాదారులంతా సద్వినియోగం చేసుకోవాలని కారుమంచి స్టేట్‌బ్యాంక్ మేనేజర్ రాంబాబు అన్నారు. నర్సరావుపేట రీజినల్ మేనేజర్, ఎఫ్ఐ మేనేజర్ ఆదేశాల మేరకు నాబార్డు సౌజన్యంతో మండలంలోని భాస్కర్‌నగర్ గ్రామంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం రాత్రి నిర్వహించారు. విభూతి బ్రదర్స్ కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం కళాజాత సభ్యులు పాల్గొని స్టేట్‌బ్యాంక్ స్కీములపై వీధినాటిక నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. స్టేట్‌బ్యాంక్‌లో అమలుచేస్తున్న కేంద్రప్రభుత్వ బీమా పథకాలు, వివిధ రకాల రుణాలు, నగదు డిపాజిట్‌లపై వడ్డీలు, ఏటీఎం సే వలు, యోనోయాప్ సేవలు తదితర అంశాలను ప్రజలకు వివరించారు. బ్రాంచ్ మేనేజర్ రాంబాబు మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ళతో ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తులు యూజర్ ఐడీలు, పాస్‌వర్డ్‌లు, ఓటీపీలు అడిగితే చెప్పరాదన్నారు. కార్యక్రమంలో కళాజాత సభ్యులు శివశంకర్, తిరుపతి పాల్గొన్నారు.

స్థానికుల ఓట్లు తొలగించేందుకు దరఖాస్తులు

మతుకుమల్లి (శావల్యాపురం) ఫిబ్రవరి 28: గ్రామంలోనే స్థానికంగా నివాసముంటూ, అన్ని ఆధారాలున్నా ఓట్లు తొలగించేందుకు కొందరు నాయకులు ఫాం-7 దరఖాస్తులు పెడుతున్నారని మండలంలోని మతుకుమల్లి గ్రామానికి చెందిన ఓటర్లు బుధవారం ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన శిరివెల్ల నారాయణమ్మ, శిరివెల్ల శ్రీనివాసరావు, పాలపాటి నాగేశ్వరరావులు ఎంతో కాలం నుంచి గ్రామంలోనే నివాసముంటున్నారని, వారి ఆధార్, రేషన్ కార్డులన్నీ గ్రామంలోనే ఉన్నాయని, ఐనా కొందరు ఓట్లు తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారని వాపోయారు. ఫాం-7లు పెట్టిన వారిని అడిగితే దరఖాస్తులు తాము పెట్టలేదని చెబుతున్నారని, వారికి తెలియకుండా ఇలా దరఖాస్తులు పెట్టడం అన్యాయమని, అధికారులు విచారణచేసి తమకు న్యాయం చేయాలన్నారు.

కనపర్తి బావి వద్ద ఆటో దగ్ధం

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 28: నరసరావుపేట నుంచి చిలకలూరిపేట వెళ్తున్న ఓ టాటా ఏస్ ఆటో కనపర్తి బావి వద్ద ఇంజన్‌లో సంభవించిన షార్ట్ సర్క్యూట్ వల్ల దగ్ధమైంది. స్థానికులు వెంటనే అగ్నిమాపక శాఖ సిబ్బందికి సమాచారం అందించగా వారు మంటలను అదుపులోకి తెచ్చారు. ఆటో పట్టణానికి చెందిన పోతురాజు అనే వ్యక్తిది.

మత్స్యకారుల సంక్షేమానికి ప్రత్యేక కృషి

● కలెక్టర్ శివశంకర్



లబ్ధిదారులకు వాహనాలను అందజేస్తున్న కలెక్టర్ శివశంకర్, జడ్పీ చైర్‌పర్సన్ క్రిస్టీనా

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 28: మత్స్యకారుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక కృషి చేస్తున్నాయని జిల్లా కలెక్టర్ శివశంకర్ తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన పథకం ద్వారా రాయితీపై ఇద్దరు లబ్ధిదారులకు వాహనాలను జిల్లా కలెక్టర్ శివశంకర్, జిల్లా పరిషత్ చైర్మన్ హెన్రీ క్రిస్టినా అందజేశారు. లబ్ధిదారులు కే.మధుసూదనరావు యూనిట్ ధర రూ.22,00,000/-, సబ్సిడీ రూ.1,00,000, ఎలిజల వినయ్‌బాబు యూనిట్ ధర రూ.21,00,000/- సబ్సిడీ రూ.8,00,000/- అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి ఎస్.సంజీవరావు, మత్స్యశాఖ అభివృద్ధి అధికారులు జి.భాగ్యలత, టీపీఏ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నాయకురాలు నాగమ్మ అవార్డులకు ఆహ్వానం

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 28: మార్చి 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవంను పురస్కరించుకుని నాయకురాలు నాగమ్మ అవార్డులను 7వ తేదీన ప్రదానం చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. పల్నాడు జిల్లాలో వ్యాపార, విద్య, కళలు, క్రీడా రంగాల్లో ప్రతిభ చాటిన మహిళలకు నాయకురాలు నాగమ్మ పేరుమీద అవార్డులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తికలిగిన వారు మార్చి 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు మహిళా శ్రీ శిశుసంక్షేమశాఖ పీడీ, సీడీపీవోలను సంప్రదించాలన్నారు. దరఖాస్తు చేసుకున్న మహిళల దరఖాస్తులను పరిశీలించి ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. నాయకురాలు నాగమ్మ అవార్డుకు రూ.10,116/- తోపాటుగా, మెమెంటో, శాలువాతో సత్కరించటం జరుగుతుందన్నారు. వివరాలకు 9491051745, 7799025664 నంబర్లను సంప్రదించాలన్నారు.

రుణమాఫీ, సున్నా వడ్డీ పంట రుణాల చెక్కుల పంపిణీ

నరసరావుపేట అర్బన్, ఫిబ్రవరి 28: పల్నాడు జిల్లాకు సంబంధించి వరుసగా ఐదో సంవత్సరం మూడో విడతగా సుమారు 2,58,386 మంది రైతులకు, 20,076మంది కౌలు రైతులు, 1719మంది అటవీ భూముల సాగు కుటుంబాలకు రూ.56.70 కోట్లు విలువైన చెక్కును కలెక్టర్ శివశంకర్ జడ్పీ చైర్మన్ హెన్రీ క్రిష్టీనా బుధవారం అందజేశారు. కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ సున్నా వడ్డీ పంట రుణాల కింద రబీ 2021-22, ఖరీఫ్ 2022 సంవత్సరానికి 38,476 మంది రైతులకు రూ.10.72 కోట్లు ఖాతాల్లోకి జమచేయటం జరిగిందని కలెక్టర్ తెలిపారు. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను, రైతు భరోసా కేంద్రాల సేవలను వినియోగించుకోవాలన్నారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ హెన్రీ క్రిష్టీనా మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల్లో లేనివిధంగా రైతులకు మంచి పథకాలు అందిస్తున్నామన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తిని దెబ్బతీస్తున్న వైసీపీ నాయకుల అహం

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 28 : వైసీపీ నాయకుల అహం ఏపీలో క్రీడాకారుల క్రీడా స్ఫూర్తిని దెబ్బతీస్తోందని, వైసీపీ నాయకుల ఒత్తిళ్లతో తెలుగుతేజాలు ఎన్నో పక్క రాష్ట్రాలకు వెళ్ళి వారి అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ప్రతిభావంతుడైన క్రికెటర్ హనుమ విహారి వైసీపీ నేతల ఒత్తిళ్ళకు బలి కావాల్సి వచ్చిందన్నారు. వైసీపీ నేత కూమారుడిని మందలించిన పాపానికి విహారిని ఆంధ్ర రంజీ కెప్టెన్సీ బాధ్యతల నుంచి తొలగించేలా కుట్ర చేశారన్నారు. విహారీ తప్పేమి లేదని టీమ్ సభ్యులు ఒకవైపు స్పష్టంగా చెప్పినా వైసీపీ నేతల వేధింపులు ఆగలేదని, విహారీ కెప్టెన్‌గా కొనసాగించాలని అశ్విన్ సహా అనేకమంది మద్దతుగా నిలిచారని అన్నారు. వైసీపీ నేతలు రాజారెడ్డి రాజ్యాంగాన్ని క్రికెట్‌లో కూడా అమలు చేస్తున్నారని అన్నారు. క్రీడలను క్రీడలుగా మాత్రమే చూడాలని, అప్పుడే అసలైన ఆణిముత్యాలు బయటకు వస్తాయన్నారు. ఆంధ్ర రంజీ క్రికెట్ టీమ్ ఓ మంచి ఆటగాడిని వైసీపీ నేతల అహం కారణంగా కోల్పోయిందన్నారు. తనకు జరిగిన అన్యాయానికి మనస్తాపం చెందిన విహారి ఇకపై తాను ఆంధ్ర టీమ్‌కు ఆడనని అనటం దురదృష్టకరమన్నారు. ఒక వైపు ఆడుదాం ఆంధ్రా అంటూ మరో వైపు క్రీడాకారులను జగన్‌రెడ్డి ప్రభుత్వం అణగదొక్కుతుందన్నారు. వైసీపీ పాలనలో క్రీడా వ్యవస్థను నీరు కారుస్తున్నారని, క్రీడాభివృద్ధికి 56 నెలల పాలనలో చేసింది ఏమీ లేదన్నారు. రానున్న ఎన్నికలలో లబ్ధిపొందడానికి ఆడదాం ఆంధ్ర పేరుతో జగన్‌మోహన్‌రెడ్డి ప్రచార ఆర్భాటం చేశారన్నారు. నాశిరకం క్రీడా వస్తువులు ఇచ్చారని, అందులోనూ అవినీతే జరిగిందన్నారు. జగన్ ప్రభుత్వం క్రీడాకారుల భవిష్యత్‌తో ఆడుకుంటుందన్నారు. విహారి పొరుగు రాష్ట్రానికి వెళ్లేలా అనుచితంగా వ్యవహరించిన జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం హనుమ విహారికి మంత్రి రోజా క్షమాపణలు చెప్పాలని, తిరిగి కెప్టెన్సీ ఇచ్చి రాష్ట్ర క్రీడాభివృద్ధికి తోడ్పడాలన్నారు.

టైలర్లకు అండగా శివశక్తి ఫౌండేషన్

● శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ చైర్మన్ లీలావతి



కార్యక్రమంలో మాట్లాడుతున్న శివశక్తి ఫౌండేషన్ చైర్మన్ గోనుగుంట్ల లీలావతి

వినుకొండ, ఫిబ్రవరి 28: టైలర్ల కుటుంబాలకు శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ అండగా ఉంటుందని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సతీమణి, ఫౌండేషన్ చైర్మన్ గోనుగుంట్ల లీలావతి అన్నారు. స్థానిక మసీదు మాన్యంలోని టైలర్స్ కార్యాలయ ఆవరణలో బుధవారం టైలర్స్‌డేను పురస్కరించుకొని టైలర్స్ అసోసియేషన్ వార్షికోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న లీలావతి కుట్టుమిషన్ కొనుగొన్న శాస్త్రవేత ఐజాక్ మెరిట్ సింగర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ టైలర్లలో అధిక కుటుంబాలను దగ్గరగా చూసిన వ్యక్తుల్లో నేను ఒకరిని అని, పేదరికంలో మగ్గుతూ చాలామంది ఇబ్బందులు పడుతున్నారని, టీడీపీ-జనసేన సంయుక్త ప్రభుత్వం వచ్చిన వెంటనే ఇళ్లులేని నిరుపేద దర్జీలకు ఆంజనేయులు ఆధ్వర్యంలో నివాసగృహాలను ఇచ్చేందుకు కృషి చేస్తామన్నారు. దర్జీల పిల్లలకు స్కాలర్‌షిప్‌లు అందజేయడం జరుగుతుందన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. నూతనంగా కుట్టు మిషన్ నేర్చుకునేవారికి శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ ద్వారా అవసరమయ్యే ఖర్చులను చెల్లిస్తామని, టైలర్స్ అసోసియేషన్ సభ్యులు ఈ నిర్వహణ బాధ్యతలను తీసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా లీలావతి చేతుల మీదుగా కుట్టుమిషన్‌ను అందజేశారు. అదేవిధంగా జనసేన ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి నిశ్శంకర శ్రీనివాసరావుతో పాటు స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు తనయుడు గిరిబాబు అసోసియేషన్ సభ్యులను కలిసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఆయూబ్‌ఖాన్, యువ నాయకుడు షేక్ జానీతో పాటు నూతనంగా ఎంపికైన టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాండ్స్ టైలర్, షమీమ్‌ఖాన్, పి.వి.సురేష్, అక్బర్ బాషా, అజంత టైలర్ బాబు, ఇస్మాయిల్, ఎంఎస్ టైలర్, సీపీఐ నాయకులు మారుతివరప్రసాద్, సంద్రపాటి సైదా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం



గీతాంజలి పాఠశాలలో సైన్స్ నమూనాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

వినుకొండ, ఫిబ్రవరి 28: పట్టణంలోని గీతాంజలి పాఠశాల నందు జాతీయ సైన్స్ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ మేధాశక్తికి పదునుపెట్టి తయారుచేసిన సైన్స్ నమూనాలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. పాఠశాల ప్రిన్సిపాల్ టి.కృష్ణవేణి మాట్లాడుతూ విద్యార్థుల్లో అపారమైన మేధసంపద దాగి ఉంటుందని, దానిని వెలికితీసే బాధ్యత ప్రతిఒక్క ఉపాధ్యాయుడిపై ఉంటుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ వై.ఎల్.కిషోర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● వెల్లటూరు రోడ్డులోని గుడ్‌షపర్డ్ పాఠశాల నందు జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులు 80 రకాల సైన్స్ నమూనాలను తయారు చేసి ప్రదర్శించారు. ప్రదర్శన కార్యక్రమాన్ని పాఠశాల డైరెక్టర్ డాక్టర్ ఇన్నారెడ్డి ప్రారంభించారు.

● విద్యార్థుల్లో దాగి ఉన్న విజ్ఞానాన్ని సైన్స్‌డే కార్యక్రమంలో భాగంగా వెలుగులోకి తీసుకురావడం ఎంతో అభినందనీయమని చీకటీగలపాలెం మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి అన్నారు. స్థానిక నిర్మలా పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ దినోత్సవాన్ని పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ రాణి గోవిందు, కరస్పాండెంట్ క్యాస్పర్ మేరి ప్రారంభించి విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలను తిలకించి వారిని అభినందించారు.

● యడ్లపాడు: యడ్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో శాస్త్రవేత్త సర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రథమస్థానం, సొలస జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ద్వితీయ స్థానం, లింగారావుపాలెం జడ్పీ హైస్కూల్ విద్యార్థులు తృతీయస్థానంలో నిలిచారు.

● చిలకలూరిపేట: పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు డాక్టర్ పీవీ సుబ్బారావు సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వేదిక పల్నాడు జిల్లా అధ్యక్షుడు దార్ల బుచ్చిబాబు, గ్రంథాలయ ఇన్‌చార్జ్ మీరావలి, సరోజిని తదితరులు పాల్గొన్నారు.

● నూజెండ్ల: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో సైన్స్‌డేను పురస్కరించుకొని బుధవారం విద్యార్థులు వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. నూజెండ్ల, కంభంపాడులలో జరిగిన సైన్స్ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్ఎం వీవీ శ్రీనివాసరావు, కంభంపాడు హెచ్ఎం వీ నరసింహారావు, ఉపాధ్యాయులు ఇస్సాక్, పద్మావతి, తిలక్, ప్రకాశ్ యాదవ్, వీ శ్రీనివాసరావు, ఎల్ అంజిరెడ్డి, ఎం అన్నామణి, బీ చినగోవిందు తదితరులు పాల్గొన్నారు.

● శావల్యాపురం: శ్రీరామ పబ్లిక్ స్కూల్లో బుధవారం వైజ్ఞానిక ప్రదర్శనను నిర్వహించారు. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన వివిధ అంశాలపై నమూనాలు తయారు చేసి అందరినీ ఆకట్టుకున్నారు. ముఖ్యఅతిథులుగా వైసీపీ మండల నాయకులు ముండ్లమూరి అనిల్‌కుమార్, డాక్టర్ రమ్య పాల్గొని విద్యార్థుల ప్రదర్శనలు తిలకించి వారిని అభినందించారు. పాఠశాల కరస్పాండెంట్ కేవీర్ మోహన్‌చంద్, ప్రిన్సిపాల్ రత్నకుమారి, డైరెక్టర్ అజిత్‌చంద్ తదితరులు పాల్గొన్నారు.

● నరసరావుపేట టౌన్: పట్టణంలోని టైనీటాట్స్ పాఠశాలలో బుధవారం సైన్స్ ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు పాతూరు కోటేశ్వరమ్మ, కరణం శివకుమారి, ఏవో ఎలవర్తి శ్రీనివాసరావు, సైన్స్ ఉపాధ్యాయులు అనీలా, రమా, నందిని పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధికోసం చంద్రబాబును గెలిపించాలి

కొత్తలూరు (శావల్యాపురం) ఫిబ్రవరి 28: వైసీపీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలతో వెనుకబడ్డ రాష్ట్రాన్ని గాడినపెట్టి అభివృద్ధిపథంలో తీర్చిదిద్దాలంటే చంద్రబాబును గెలిపించాల్సిన బాధ్యత ప్రజలందిరిపై ఉందని టీడీపీ మండలాధ్యక్షుడు గుంటూరు సాంబశివరావు అన్నారు. మండలంలోని కొత్తలూరులో మంగళవారం రాత్రి మినీ మ్యానిఫెస్టోపై ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ గుంటూరు నాగమల్లేశ్వరి, గ్రామ పార్టీ అధ్యక్షుడు తిరువీధి రవిశంకర్, యూనిట్ ఇన్‌చార్జి దివ్వకోలు శ్రీనివాసరావు, బూత్ కన్వీనర్ కాసరగడ్డ వెంకటేశ్వర్లు, టీడీపీ సీనియర్ నాయకులు గడిపూడి విశ్వనాథం, గోరింట్ల హనుమంతరావు, ఒత్తుల వెంకటేశ్వర్లు, అమృతపూడి కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

భద్రత కోసం అదనపు బలగాలను పంపాలి

● టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 28: వినుకొండ నియోజకవర్గంలో పోలింగ్ బూత్ వద్దకు అదనపు బలగాలను పంపాలని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు అన్నారు. బుధవారం పల్నాడు జిల్లా జరసరావుపేట కలెక్టరేట్‌లో కలెక్టర్ శివశంకర్ లోతేటి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా రాపర్ల జగ్గారావు మాట్లాడుతూ వినుకొండ నియోజకవర్గంలో టీడీపీ సానుభూతి పరుల ఓట్లు మాత్రం తొలగిస్తున్నారని అన్నారు. దీనిపై తగిన చర్యలు తీసుకొని ఎన్నికలు సక్రమంగా జరిగేలా సహకరించాలన్నారు. కార్యక్రమంలో గూడూరు శేఖర్, బూదాల బాబురావు తదితరులు పాల్గొన్నారు.

జీవోను ఉపసంహరించుకోవాలి

● ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మహంకాళి సుబ్బారావు

వినుకొండ టౌన్, ఫిబ్రవరి 28: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన అమ్మఒడి డబ్బులను తిరిగి విద్యార్థులు ఫీజుల రూపంలో పాఠశాలలకు చెల్లించాలని ఆదేశించడాన్ని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మహంకాళి సుబ్బారావు బుధవారం తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాహక్కు చట్టప్రకారం రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో 25 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ విద్యార్థులకు ఉచితంగా సీట్లు కేటాయించి విద్యను అందించాల్సి ఉందని, జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు అధికారంలోకి రాగానే విద్యార్థులందరికి అమ్మఒడి కింద సంవత్సరానికి రూ.15వేలు ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు ఆ హామీని తుంగలో తొక్కి అమ్మఒడి కింద ఇచ్చిన డబ్బులు తిరిగి చెల్లించాలని రాష్ట్ర విద్యాశాఖ ఇచ్చిన ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. విద్యారంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తూ విద్యను అందని ద్రాక్షలా నాణ్యమైన విద్యను అందించలేదన్నారు. అమ్మఒడికి చెల్లించిన డబ్బులను ఫీజు రూపంలో డబ్బులు చెల్లించాలని ఆదేశించడం వల్ల విద్యార్థులు, తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారన్నారు. అమ్మఒడి కింద ప్రభుత్వం చెల్లించిన డబ్బులను విద్యార్థులకు అవసరమైన యూనిఫాం, పుస్తకాల కొనుగోలు నిమిత్తం ఖర్చు చేయడం జరిగిందని, ఇప్పుడు ఆ డబ్బులు కట్టాలంటే తల్లిదండ్రులు ఎక్కడి నుంచి తీసుకురావాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన జీవోను వెంటనే ఉపసంహరించుకోకుంటే రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థి యువజన సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.



అన్నదానం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

ప్రత్తిపాటి ఫౌండేషన్ అన్నదానం

చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి 28: పట్టణంలో ప్రత్తిపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్న క్యాంటీన్ సేవలు కొనసాగుతున్నాయి. బుధవారం కల్యాణి సెంటర్‌లో ఏర్పాటుచేసిన అన్న క్యాంటీన్ ద్వారా ఆరు వందల 645మంది పేదలకు భోజన సదుపాయం కల్పించారు. ఈ అన్న క్యాంటీన్ నిర్వహణలో టీడీపీ నాయకులు షేక్ కరీం, తూబాడు సుభానీ, టైలర్ ఖాజావలి, షేక్ అన్సర్, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, జువ్వాజి బుచ్చిబాబు తదితరులు పాల్గొని స్వచ్ఛందంగా సేవలు అందించారు.



ఆర్థికసాయం అందిస్తున్న టీడీపీ నాయకులు

ఆర్థికసాయం అందజేత

చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి 28: పట్టణంలోని 23వ వార్డుకు చెందిన లింగం పద్మ ఇటీవల మరణించింది. విషయం తెలుసుకున్న మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు వారి కుటుంబానికి సానుభూతి తెలియజేశారు. ప్రత్తిపాటి ఫౌండేషన్ ద్వారా రూ.10వేలు ఆర్థికసాయాన్ని తెలుగుదేశం పార్టీ నాయకుల ద్వారా బుధవారం అందించారు. కార్యక్రమంలో కంచర్ల శ్రీనివాసరావు, గుడిపల్లి సాంబశివరావు, తెల్లబాటి మోహన్‌కృష్ణ, కందుల రమణ, కంచర్ల కరుణ, కర్పూరపు రమేష్, మేకపోతుల బొల్లయ్య, నిమ్మకాయల ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి సభతో వైసీపీ నేతల గుండెల్లో గుబులు: అరవిందబాబు

రొంపిచర్ల, ఫిబ్రవరి 28: తాడేపల్లిగూడెంలో టీడీపీ, జనసేన ఉమ్మడి సభ వైసీపీ నేతల గుండెల్లో గుబులు పుడుతుందని టీడీపీ ఇన్‌చార్జ్ అరవిందబాబు పేర్కొన్నారు. మండలంలోని కొత్తపల్లిలో జరిగిన బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేనిఫెస్టో గురించి వివరించారు. ఉమ్మడి అభ్యర్థులు అధికశాతం విజయం సాధిస్తారని తెలిపారు. నరసరావుపేట పార్లమెంట్ సెగ్మెంట్‌లో ఎంపీ సీటుతో సహా ఏడు స్థానాలు గెలుపొందుతామని పేర్కొన్నారు. దాడులతో భయపెట్టలేరని, పోలీసులు కూడా చోద్యం చూస్తున్నారని ఆరోపించారు. టీడీపీ, జనసేన, బీజేపీ నేతలపై అల్లరి మూకలు దాడులు చేస్తున్నాయని, అధికారంలోకి రాగానే అన్ని అప్పచెపుతామని తెలిపారు. కార్యక్రమంలో పులుకూరి జగ్గయ్య, పల్లెల నాగిరెడ్డి, గాడిపర్తి సురేష్, గంగూరి రవి, రామకృష్ణ, మండలంలోని వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి విగ్రహ ప్రతిష్ఠ పూజలు



లక్ష్మీనరసింహస్వామి విగ్రహానికి పూజలు చేస్తున్న పండితులు

కొండవీడుకోట (యడ్లపాడు), ఫిబ్రవరి 28: మండలంలోని చారిత్రక కొండవీడుకోటలో పునఃనిర్మించిన లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ప్రతిష్ఠా మహోత్సవాలు రెండో రోజైన బుధవారం కొనసాగాయి. తొలిరోజు జీవధ్వజ, స్వామివార్ల శోభాయాత్రను కన్నుల పండువగా నిర్వహించగా రెండోరోజు యాగశాల ప్రవేశం గావించారు. పూజా కార్యక్రమాలలో కొండవీడుకోట అభివృద్ధి కమిటీ కన్వీనర్ కల్లి శివారెడ్డి దంపతులు, ఈవో శివయ్య, స్థానికులు పాల్గొన్నారు. కాగా గురువారం విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు ఈవో తెలిపారు.

భవిష్యత్ గ్యారెంటీపై ప్రచారం

చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి 28: మండలంలోని మురికిపూడిలో మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ఆదేశాల మేరకు భవిష్యత్ గ్యారెంటీపై ప్రచారం నిర్వహించారు. బుధవారం టీడీపీ నాయకులు గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్ళి సూపర్-6 పథకాల గురించి, నిత్యావసర ధరల పెరుగుదల గురించి, వైసీపీ వైఫల్యాల గురించి ప్రజలకు వివరించారు. టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిని గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మండల పార్టీ అధ్యక్షుడు జవ్వాజి మదన్ మోహన్, ప్రధాన కార్యదర్శి బడుగు జాకబ్ రాజు, క్లస్టర్ ఇన్‌చార్జ్ గంజి శ్రీనివాసరావు, పార్టీ అధ్యక్షుడు చెన్నుపాటి నాగరాజు, టీడీపీ, జనసేన కార్యకర్తలు, పాల్గొన్నారు.

దేవాలయ అభివృద్ధికి రూ.4 లక్షల విరాళం

చిలకలూరిపేట, ఫిబ్రవరి 28: పట్టణంలోని పోలిరెడ్డిపలెంలో ఉన్న సిద్ధి బుద్ధి వినాయకస్వామి దేవస్థాన ప్రాంగణంలో ఫ్లోరింగ్ వేయటానికి రూ.4లక్షల విరాళాన్ని పట్టణానికి చెందిన ఏ కిరణ్, సంధ్య దంపతులు ఇచ్చారు. ఈ సందర్భంగా వారిని బుధవారం ఆలయంలో ఘనంగా సత్కరించారు. ఆలయ అర్చకులు ఎస్.రామలింగేశ్వరశర్మ మాట్లాడుతూ ఈ దంపతులను ఆదర్శంగా తీసుకొని దేవాలయ అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు తియ్యగూర బల రామిరెడ్డి, తియ్యగూర అంజిరెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, తియ్యగూర చంటి తదితరులు పాల్గొన్నారు.

నవతరం పార్టీ ఎన్నికల జాబితా విడుదల

చిలకలూరిపేట, ఫిబ్రవరి 28: ఎన్నికల్లో పోటీ చేయనున్న నవతరం పార్టీ అభ్యర్థుల తొలి జాబితాను బుధవారం ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు పట్టణ కార్యాలయంలో ప్రకటించారు. 15 అసెంబ్లీ స్థానాలకు, 15 పార్లమెంట్ స్థానాలకు అభ్యర్థుల పేర్లను ఆయన ప్రకటించారు.

ప్రభల నిర్వాహకులతో డీఎస్పీ సమావేశం

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 28: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ప్రభల నిర్వాహకులతో తీసుకోవాల్సిన చర్యలపై బుధవారం నరసరావుపేట డీఎస్పీ వర్మ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభల నిర్వాహకులు గత ఏడాది చోటు చేసుకున్న అపశృతులను దృష్టిలో ఉంచుకొని జాగ్రత్తగా ప్రభలను ప్రభల నిధికి తరలించాలని కోరారు. ప్రభలు వచ్చి పోయే మార్గాలు, నిలిపే స్థలం త్వరలో సూచిస్తామన్నారు. ఎటువంటి పార్టీలకు వర్గ వైషమ్యాలకు తావులేకుండా సంతోషదాయకమైన వాతావరణంలో పండుగను జరుపుకోవాలన్నారు. కోటప్పకొండ తిరునాళ్ళకు వచ్చే వాహనాలు, తిరిగి వెళ్ళే వాహనాలు, ప్రైవేట్ వాహనాలు, వీఐపీ వాహనాలు నిలిపే స్థలం తదితర వివరాలతో త్వరలో ఓ యాప్‌ను రూపొందించనున్నట్టు ఆయన తెలిపారు. త్వరలో వివరాలను వెల్లడిస్తామన్నారు. కార్యక్రమంలో ట్రైనీ డీఎస్పీ జగదీష్, నరసరావుపేట, చిలకలూరిపేట ప్రభల నిర్వాహకులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

తిరుమల ఇంజనీరింగ్ కళాశాలలో వర్క్‌షాపు ప్రారంభం

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 28: మండలంలోని జొన్నలగడ్డలోని తిరుమల ఇంజనీరింగ్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం ఈసీఈ విద్యార్థులకు పీసీబీ డిజైన్ మీద మైక్రోలింక్ విజయవాడవారిచే నిర్వహించిన వర్క్‌షాపును కళాశాల ప్రిన్సిపాల్ వైవీ నారాయణ ప్రారంభించారు. ఈ వర్క్‌షాపును మైక్రోలింక్ వ్యవస్థాపకులు గోవిందరావు, టెక్నీషియన్స్ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులందరూ చదువుతోపాటుగా ప్రాక్టికల్ నాలెడ్జ్ పెంపొందించుకుంటారో అటువంటి విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా వస్తాయన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ రావెల సత్యనారాయణ, ఈసీఈ విభాగాధిపతి టి.జగదీష్, తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో జూలకంటి బ్రహ్మారెడ్డి

టీడీపీలో చేరిన యాదవ సామాజిక వర్గీయులు

వెల్దుర్తి, ఫిబ్రవరి 28: మండలంలోని గంగలకుంటకు చెందిన యాదవ సామాజిక వర్గీయులు 25 వైసీపీ కుటుంబాలు బుధవారం ఆ పార్టీని వీడి టీడీపీలో చేరారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ నియోజకవర్గ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి వీరికి పార్టీ కండువాను కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ కుర్రి శివారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు పులుసు శివారెడ్డి, రామాంజిరెడ్డి, మధు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను పరామర్శించిన బ్రహ్మారెడ్డి

దుర్గి, ఫిబ్రవరి 28: మండలంలోని పోలేపల్లికి చెందిన ఎల్లూరి ఏసమ్మ, కొణతం ముక్కేసులు అనారోగ్య కారణాలతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న టీడీపీ మాచర్ల నియోజకవర్గ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి బుధవారం గ్రామానికి చేరుకొని మృతుల భౌతికకాయాల వద్ద నివాళులర్పించారు. ఏసమ్మ కుటుంబసభ్యులకు రూ.20 వేలు, ముక్కేసు కుటుంబ సభ్యులకు రూ.10 వేలు ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తల హత్యకు కుట్ర

● పట్టణ అధ్యక్షుడు దుర్గారావు



విలేకరులతో మాట్లాడుతున్న దుర్గారావు

మాచర్ల, ఫిబ్రవరి 28 : పథకం ప్రకారం తమ పార్టీ కార్యకర్తలను హత్య చేసేందుకు వైసీపీ నేతలు కుట్ర పన్నారని టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు అన్నారు. టీడీపీ, వైసీపీ ఘర్షణకు సంబంధించి దుర్గారావు పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తూర్పు బావి ప్రాంతంలో బాబు షూరిటీ-భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించేందుకు తమ పార్టీ నేతలు ఆ ప్రాంతంలో బుధవారం మధ్యాహ్న సమయంలో ఫ్లెక్సీలు, తోరణాలు కట్టే పనిలో నిమగ్నమయ్యారన్నారు. వైసీపీ నేతలు తమ ఫ్లెక్సీలు, తోరణాలు చించివేసి అప్పటికే సిద్ధంగా ఉంచుకున్న కర్రలు, రాళ్లతో విచక్షణా రహితంగా దాడి చేశారన్నారు. ఈ దాడిలో తమ పార్టీ నేతలు గాయపడ్డారన్నారు. ముస్లిం వార్డుల్లో టీడీపీకి పెరుగుతున్న ఆదరణకు తట్టుకోలేక హత్యా రాజకీయాలు ప్రోత్సహించే పిన్నెల్లి సోదరులు దాడులకు తెగబడుతున్నారన్నారు.

ఉద్దేశపూర్వకంగానే దాడి : కేశవరెడ్డి

మాచర్ల, ఫిబ్రవరి 28 : తమ పార్టీ నేతలపై ఉద్దేశపూర్వకంగా వైసీపీ నేతలు దాడులు చేశారని టీడీపీ నేత యెనుముల కేశవరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని తూర్పుబావి జెండాచెట్టు వద్ద జరిగిన టీడీపీ, వైసీపీ ఘర్షణపై ఆయన టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తమ పార్టీ నేతలపై దాడి చేయడమే గాక మాపైనే కేసులు పెట్టే ఆలోచనలో వైసీపీ నేతలు ఉన్నారన్నారు. దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. ఎమ్మెల్యే పీఆర్కే పతనం దగ్గరలోనే ఉందన్నారు. ఉన్నతాధికారులు వాస్తవాలను గమనించి న్యాయం చేయాలన్నారు. ఆయన వెంట టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు, మండల అధ్యక్షుడు నేరేటి వీరాస్వామి యాదవ్, విద్యాధరణి మురళి, సీనియర్ నేత పేరువాల పుల్లారావు, వజ్రం నాయక్, బాలశౌరి, కొండూరి లెనిన్‌బాబు, నర్రా గురవారెడ్డి, మున్నా హనుమంతు, బండ్ల శ్రీను, కొమెర అనంతరాములు, సీతా అంజి, సంబోజు వేణు, మంజుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

జాబు రావాలంటే.. బాబు రావాలి : టీడీపీ



కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నేతలు

రెంటచింతల, ఫిబ్రవరి 28 : రాష్ట్రంలో యువతకు జాబు రావాలంటే బాబు రావాలని టీడీపీ నేతలు అన్నారు. మేజర్ పంచాయతీ రెంటచింతల పరిధిలోని ఎస్సీ కాలనిలో బుధవారం ఇంటింటికి కరపత్రాలను పంపిణీ చేశారు. గతంలో ఎన్నో పరిశ్రమలను తెచ్చి ఉపాధి కల్పించిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. కనుక టీడీపీ, జనసేన అభ్యర్థైన జూలకంటి బ్రహ్మారెడ్డిని మంచి మెజార్టీతో అసెంబ్లీకి పంపుదామన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు గొంటు సుమంత్‌రెడ్డి, టౌన్ అధ్యక్షులు రాజారెడ్డి, నారాయణపురం శ్రీను, బోడపాటి రామకృష్ణ, మామిడి రవి, జ్ఞానయ్య, దానయ్యథామస్, బాల ఏసు, మల్లయ్య యాదవ్, మునినాయక్, జనసేన మండల అధ్యక్షులు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తు బాగుండాలంటే చంద్రబాబు సీఎం కావాలి : కేశవరెడ్డి

మాచర్ల రూరల్, ఫిబ్రవరి 28 : రాష్ట్ర ప్రజల భవిష్యత్తు బాగుండాలంటే టీడీపీ అధినేత చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని టీడీపీ నేత యెనుముల కేశవరెడ్డి అన్నారు. పట్టణంలోని ఏడో వార్డులో నిర్వహించిన బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారంటీలో ఆయన పాల్గొని మాట్లాడారు. వైసీపీ పాలనలో రాష్ట్రం పూర్తిగా అధోగతి పాలైందన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ టీడీపీ మేనిఫెస్టోను వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు, మండల అధ్యక్షుడు నేరేటి వీరాస్వామి యాదవ్, విద్యాధరణి మురళి, సీనియర్ నేత పేరువాల పుల్లారావు, వజ్రం నాయక్, బాలశౌరి, కొండూరి లెనిన్‌బాబు, నర్రా గురవారెడ్డి, మున్నా హనుమంతు, బండ్ల శ్రీను, కొమెర అనంతరాములు, సీతా అంజి, సంబోజు వేణు, మంజుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

● కారంపూడి, ఫిబ్రవరి 28: రాష్ట్ర భవిష్యత్ బాగుండాలంటే టీడీపీ, జనసేన గెలవాలని ఆ పార్టీల నేతలు అన్నారు. కారంపూడిలో బుధవారం టీడీపీ, జనసేన ఆధ్వర్యాన బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీ నిర్వహించారు. టీడీపీ, జనసేన బ్యానర్లు చించడం, వారిపైనే కేసులు పెట్టడం వంటి దుర్మార్గ పాలన సాగుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కటికల బాలకృష్ణ, మాజీ అధ్యక్షుడు తండా మస్తాన్ జాని, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కాల్వ పేరయ్య, ఎస్టీ సెల్ అధ్యక్షుడు బాలునాయక్, బీసీ నేత బి.నాగేశ్వరరావు, గోరంట్ల నాగేశ్వరరావు, జానీ, తుపాకుల చిన రత్తయ్య, షేక్ నన్నేసా, మోదీన్‌సా పాల్గొన్నారు.

●పిడుగురాళ్ల, ఫిబ్రవరి 28 : పట్టణంలోని 16వ వార్డులో టీడీపీ పథకాలను ప్రచారం చేయడంతో పాటు బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని పార్టీ నేతలు బుధవారం రాత్రి నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించడంతో పాటు భవిష్యత్తుకు గ్యారంటీ కార్డులను అందించారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ అమీర్‌అలి, జమ్మిశెట్టి రామకృష్ణ, నడికూడి వెంకటేశ్వరరావు, కోకాటి శారద, దామా సోమయ్య, పద్మ పాల్గొన్నారు.

స్కూల్ బిల్డింగ్ పై నుంచి పడి విద్యార్థిని మృతి

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 28: స్థానిక ఒక ప్రైవేటు స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న కొనకండ్ల రిషిత (16) అనే విద్యార్థిని ప్రమాదవశాత్తు పాఠశాల నాల్గవ అంతస్తు నుంచి కిందపడటంతో తీవ్రగాయాలపాలైన మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. మృతురాలు కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... రిషితకు మానసికస్థితి సరిగా లేకపోవడంతో కొన్నిరోజులుగా హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స తీసుకుంటుంది. పదవ తరగతి పరీక్షలు దగ్గరపడటంతో కొద్దిరోజులుగా రిషిత పాఠశాలకు హాజరై పది పరీక్షలకు సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో బుధవారం ఒక్కసారిగా నాల్గవ అంతస్తు నుంచి రిషిత కిందపడింది. పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు గాయపడిన ఆమెను హుటాహుటిన ప్రైవేటు ఆసుపత్రికి తరలించి కుటుంబసభ్యులకు, బంధువులకు సమాచారం అందజేశారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే రిషిత మృతి చెందినట్లు నిర్ధారించారు. డీఈవో వెంకటేశ్వర్లు, ఎంఈవో ఒంగోలు రాజు సంఘటనా స్థలాన్ని పరిశీలించడంతో పాటు విద్యార్థిని మృతదేహాన్ని పరిశీలించి కుటుంబసభ్యుల నుండి వివరాలు సేకరించారు.

సిమెంట్ ఫ్యాక్టరీ వద్ద కార్మికుల నిరసన

దాచేపల్లి, ఫిబ్రవరి 28: మండలంలోని పెదగార్లపాడు సిమెంట్ ఫ్యాక్టరీ మెయిన్‌గేటు వద్ద బుధవారం ఫ్యాక్టరీ కార్మికులు ధర్నా చేశారు. కార్మిక చట్టాల ప్రకారం సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యాలు కార్మికులకు కనీస వేతనం చెల్లించడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు గంటల పాటు కార్మికులు మెయిన్‌గేటు తలుపులు వేసి నిరసన వ్యక్తం చేయడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పోలీసులు రంగ ప్రవేశం చేసి కార్మికులకు నచ్చజెప్పి మూసివేసిన గేటును తెరిపించారు. యాజమాన్యం స్పందిస్తూ చట్టప్రకారమే కార్మికులకు వేతనాలు చెల్లించడం జరుగుతుందని, యాజమాన్యానికి విరుద్ధంగా వ్యవహరించిన కార్మికులకు షోకాజ్ నోటీసులు అందజేస్తామని స్పష్టం చేశారు.

టైలర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

● టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ



సభలో మాట్లాడుతున్న టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, ఫిబ్రవరి 28 : పట్టణంలో టైలర్స్ సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని ఒక ప్రైవేట్ హోటల్‌లో బుధవారం ప్రగతి టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టైలర్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కన్నా మాట్లాడుతూ జైలుకు వెళ్ళి బెయిల్‌పై వచ్చిన ముద్దాయి వైఎస్ జగన్ అన్నారు. వాయిదాలకు వెళ్ళకుండానే వ్యవస్థలను మేనేజ్ చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల రక్తాన్ని పీల్చి పిప్పి చేస్తున్న వైఎస్ జగన్ జైలుకు వెళ్ళటానికి సిద్ధంగా ఉన్నారన్నారు. టైలర్స్ అంతా రానున్న ఎన్నికల్లో తనకు సహకరించాలని కన్నా కోరారు. టైలర్స్ కమ్యూనిటీ హాల్ భవనం కోసం పట్టణానికి చెందిన టీడీపీ నేత వీరేశ్వరరావు స్థలాన్ని కేటాయిస్తామని ప్రకటించారు. కన్నా ఆయనను అభినందించారు. 40 టైలర్స్ కుటుంబాలు టీడీపీలో చేరాయి. వారికి కన్నా పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టైలర్ సైదా, టీడీపీ నేతలు ఎలినేడి రామస్వామి, చౌట శ్రీనివాసరావు, ఆతుకూరి నాగేశ్వరరావు, రాంబో బుడే, భవన్నారాయణ, లక్ష్మీతులసీ, విశ్వనాథబాబు, అంబిక, సంగీతరావు, నూర్‌బాషా జాన్ బాబు, ప్రగతి టైలర్స్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, పలువురు టైలర్స్ పాల్గొన్నారు. ముందుగా టైలర్స్ పట్టణంలో ప్రదర్శన చేశారు.

● మాచర్ల రూరల్, ఫిబ్రవరి 28 : పట్టణంలోని మెడికల్ అసోసియేషన్ బిల్డింగ్ హాలులో బుధవారం రోటరీ క్లబ్ ఆధ్వర్యాన టైలర్స్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ టైలర్లు మద్దోజు కోటయ్యాచారి, మోదడుగు విజయలక్ష్మి, అలవాల వెంకటేశ్వర్లు, తాటిపర్తి శేషారెడ్డి, అత్తరు సుభాని, రెబ్బలపల్లి భాస్కరరావులను దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రామకోటయ్య, ఇక్కుర్తి శంకర్, చిన్ని సత్యనారాయణ, పఠాన్ నాగూర్‌వలి తదితరులు పాల్గొన్నారు. పఠాన్‌బుడే సాహెబ్ జ్ఞాపకార్థం ఈ కార్యక్రమం నిర్వహించారు.

● అచ్చంపేట, ఫిబ్రవరి 28 : పేరంటాళ్ళమ్మ మండల సహకార సంఘం లిమిటెడ్ ఆధ్వర్యంలో మండలంలోని టైలర్స్ ఘనంగా టైలర్స్ డే నిర్వహించారు. రామాలయం సెంటర్‌లో జెండాను ఆవిష్కరించి విలియమ్స్ హావే గురించి వివరించారు. అనంతరం ఆర్‌అండ్‌బీ బంగ్లాలో జయంతి కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమానికి తిరువాయిపాటి ఆంజనేయులు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో నూతన అధ్యక్షుడిగా సందెపోగు గాంధీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీనియర్ టైలర్ ఎస్‌కే సైదులును పూలమాలలతో, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కే తయ్యంబ్, ఎస్‌కే బాజీ, రమేష్, ఎస్‌కే హుస్సేన్‌బీ, నాగులు, దామెర్ల వీరబ్రహ్మం, పుసులూరి ఏడుకొండలు, పఠాన్ గాలీసా పాల్గొన్నారు.

● కారంపూడి, ఫిబ్రవరి 28: కారంపూడిలో బుధవారం టైలర్స్ డేను ఘనంగా నిర్వహించారు. టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేష్ ఆధ్వర్యాన ర్యాలీ జరిపారు. రోగులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మండల రెవెన్యూ కార్యాలయంలో అందించారు. ముందుగా కుట్టుమిషన్ కనిపెట్టిన విలియం హావే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నజీర్, వెంకటేశ్వర్లు, అక్బర్‌వలి, మస్తాన్‌వలి, శంకర్, శ్రీను, సైదా, సీతానాయక్ పాల్గొన్నారు.

● రెంటచింతల,ఫిబ్రవరి 28 : రెంటచింతలలో బుధవారం టైలర్స్ డే సందర్భాన్ని పురస్కరించుకుని పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. తొలుత టైలరింగ్‌కు ఆద్యుడైన విలియమ్స్ హావే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టైలర్లకు 200 యూనిట్ల విద్యుత్ ఉచితంగా ఇవ్వాలని, 55 సంవత్సరాలు పైబడిన వారందరికి పింఛన్లు ఇవ్వాలని, ఆర్థిక స్థోమత లేని వారికి కరెంట్ మిషన్లు అందచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు రంగనాయకులు, ఉపాధ్యక్షులు ఎన్.శ్రీనివాసరావు, తిరుపతిరావు, ఆదాం, రామకోటేశ్వరరావు, పీటర్ పాల్, మణికంఠ, చంద్రం, కిషోర్, కోటేశ్వరరావు, ఖాసిం, మస్తాన్ పాల్గొన్నారు.

మాచవరంలో ఆటోమేటిక్ విద్యుత్ బోర్డులు ఏర్పాటు

మాచవరం, ఫిబ్రవరి 28 : మాచవరంలో బుధవారం వీధిలైట్లకు సంబంధించి సెన్సార్ విద్యుత్ బోర్డులను ఏర్పాటు చేశారు. దీని ద్వారా వీధిలైట్లు ఆటోమేటిక్‌గా సాయంత్రం 6 గంటలకు వెలిగి ఉదయం 6 గంటలకు ఆగిపోతాయని విద్యుత్ అధికారులు తెలిపారు. దీనివల్ల విద్యుత్ వృధా కాకుండా పొదుపు అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాగిడి నరేష్, విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది వున్నారు.

చెన్నుని దర్శించుకున్న సమగ్రశిక్ష అడిషనల్ కో ఆర్డినేటర్

మాచర్ల రూరల్, ఫిబ్రవరి 28 : పట్టణంలో ఉన్న శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామిని బుధవారం గుంటూరు జిల్లా సమగ్రశిక్ష అడిషనల్ కోఆర్డినేటర్ విజయలక్ష్మి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆమె వెంట జడ్పీ బాలుర హైస్కూల్ హెచ్ఎం రామారావు, జిల్లా ఏఎల్ఎస్ కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు, ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జూపల్లి గంగాధరబాబు, జక్కిరెడ్డి, సీఆర్పీలు సాంబశివరావు, జీజే రావు తదితరులు ఉన్నారు.




చెన్నకేశవస్వామిని దర్శించుకుంటున్న విజయలక్ష్మి

గురజాలలో మహాశక్తి కార్యక్రమం

గురజాలటౌన్, ఫిబ్రవరి 28 : పట్టణంలోని 20వ వార్డులో బుధవారం టీడీపీ, జనసేన మహిళా నేతలు మహాశక్తి కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి మహాశక్తి పథకాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షురాలు నెల్లూరి శివనాగేంద్రం, అధికార ప్రతినిధి కత్తి సుజాత, భారతి, జనసేన మండల కార్యదర్శి సూర్యకుమారి, పర్వీన్ బేగం, పిచ్చమ్మ, నవమ్మ పాల్గొన్నారు.

దౌర్జన్యాలు మంచి పద్ధతి కాదు : ఎమ్మెల్యే పీఆర్కే



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పీఆర్కే

మాచర్ల, ఫిబ్రవరి 28: దౌర్జన్యాలు చేయడం మంచి పద్ధతి కాదు బ్రహ్మారెడ్డి అంటూ ప్రభుత్వ విప్, వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి హితవు చెప్పారు. పట్టణంలోని తూర్పు బావి జెండా చెట్టు వద్ద బుధవారం టీడీపీ నేతల దాడిలో గాయపడిన వైసీపీ నేతలు పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పీఆర్కే గాయపడిన పార్టీ నేతలను పరామర్శించి విలేకరులతో మాట్లాడారు. టీడీపీ నేతలు తమ పార్టీ నేతలపై దాడులు చేస్తూ తమపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. బ్రహ్మారెడ్డి ఇన్‌చార్జిగా వచ్చినప్పటి నుంచి మాచర్ల నియోజకవర్గంలో దాడులు, దౌర్జన్యాలు పెరిగిపోయాయన్నారు. దాడులు చేయడం, భయభ్రాంతులకు గురి చేసి రాజకీయంగా లబ్ధిపొందాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వెంట వైసీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి ఉన్నారు.

టీడీపీ నుంచి వైసీపీలో చేరిక

వెల్దుర్తి, ఫిబ్రవరి 28: మండలంలోని గంగలకుంట గ్రామానికి చెందిన పలువురు టీడీపీ నేతలు బుధవారం ఆ పార్టీని వీడి వైసీపీలో చేరారు. పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి వీరికి పార్టీ కండువాను కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో కంపసాటి గోవిందు, చిన వీరయ్య, కంచర్ల వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గురుబ్రహ్మం, చింతా ఆదినారాయణ పాల్గొన్నారు.

ఎంఈవో రాజు ఉద్యోగ విరమణ

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 28 : పిడుగురాళ్ల విద్యాశాఖాధికారిగా పని చేస్తున్న ఒంగోలు రాజు పదవీ విరమణ సన్మానసభ బుధవారం స్థానిక ఎస్ఆర్‌పిటి పాఠశాలలో జరిగింది. పలువురు వక్తలు మాట్లాడుతూ విద్యాశాఖలో ఉపాధ్యాయుల మన్ననలు పొందిన ఒంగోలు రాజు అని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ అల్లు సత్యవతి, ముడేల వెంకటేశ్వరరెడ్డి, ఉపాధ్యాయులు పి.స్వామి, రఫీ, లక్ష్మణ, రామిరెడ్డి, విజయసారథి, ప్రైవేటు స్కూల్స్ యాజమాన్యం గంగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మూల్పూరి వెంకట్రామయ్య, పిజెఎస్ థన్, ఇ.భాస్కర్‌రెడ్డి, వంగా సతీష్‌రెడ్డి, అత్మకూరి రామకృష్ణ, ఎన్ వెంకట్రామయ్య, నలగాటి నాగేశ్వరరావు, కార్యాలయ సిబ్బంది తదితరులున్నారు.

శ్రీహరిరావు సేవలు ప్రశంసనీయం

సత్తెనపల్లి, ఫిబ్రవరి 28 : పట్టణ ఏఎస్ఐగా పని చేసిన కే శ్రీహరిరావు సేవలు ప్రశంసనీయమని సత్తెనపల్లి డీఎస్పీ జీ గురునాథబాబు అన్నారు. పట్టణ పోలీసు స్టేషన్‌లో ఏఎస్ఐగా పని చేస్తున్న కే.శ్రీహరిరావు ఉద్యోగ విరమణ సభ బుధవారం రాత్రి డీఎస్పీ కార్యాలయ ఆవరణలో జరిగింది. పట్టణ సీఐ ప్రభాకర్ ఆధ్వర్యంలో డీఎస్పీ, ఇతర పోలీసు సిబ్బంది శ్రీహరిరావును పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందించారు. పట్టణ ఎస్ఐ సంధ్య, రూరల్ సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

బెల్లంకొండ, ఫిబ్రవరి 28 : తెలుగుదేశం పార్టీ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్ అన్నారు. బెల్లంకొండ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. వైసీపీ పాలనలో అభివృద్ధి ఆమడ దూరంలో ఉందని విమర్శించారు. గతంలో పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని సూచించారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టోను ప్రజల వద్దకు తీసుకువెళ్ళే బాధ్యత ప్రతి ఒక్క టీడీపీ కార్యకర్తపై ఉందన్నారు. సమావేశంలో పార్టీ నేతలు లక్ష్మీనారాయణ, జ్యోతి సముద్రం, గుంజా గంగారావు, ఇబ్రహీం, వెన్నా వెంకటరెడ్డి, సయ్యద్ జబ్బార్, పీఎస్‌కే రసూల్, కొండయ్య, సీతారామిరెడ్డి, మాజీ సర్పంచ్ సుభానీ, ఎన్.పిచ్చయ్య పాల్గొన్నారు.

రామయ్య మృతి పార్టీకి తీరని లోటు

బెల్లంకొండ, ఫిబ్రవరి 28 : బెల్లంకొండ మండలం పాపాయపాలెం గ్రామానికి చెందిన తెల్లగొల్ల రామయ్య మృతి తెలుగుదేశం పార్టీకి తీరనిలోటు అని పాపాయపాలెం మాజీ సర్పంచ్ బ్రహ్మారెడ్డి అన్నారు. రామయ్య మృతదేహాన్ని బుధవారం ఆయన సందర్శించి నివాళులర్పించారు. అనంతరం పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ సహకారంతో పార్టీ నాయకులు ద్వారా రూ.10 వేలను మట్టి ఖర్చుల నిమిత్తం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు బత్తుల వెంకటరావు, ఓర్చు ప్రసాదు, వల్లూరి సత్యనారాయణ, రామ కోటయ్య ఉన్నారు. పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్, గుంటూరు మిర్చి యార్డు మాజీ చైర్మన్ వెన్నా సాంబశివారెడ్డిలు రామయ్య కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించారు. రామయ్య మృతి ఎంతో బాధాకరమని అన్నారు. కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని తెలిపారు.

విఘ్నేశ్వర దేవాలయానికి శంకుస్థాపన

క్రోసూరు, ఫిబ్రవరి 28 : మండలంలోని విప్పర్లలో విఘ్నేశ్వర దేవాలయానికి బుధవారం శంకుస్థాపన జరిగింది. తిరుమల తిరుపతి దేవస్థానం మంజూరు చేసిన నిధులతో పాటు గ్రామస్తుల విరాళాలు జోడించి దేవాలయ నిర్మాణానికి పూనుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. అర్చకులు పరాశరం రమణాచార్యులు, 75 తాళ్ళూరు శ్రీనివాసాచార్యులు శంకుస్థాపన క్రతువును నిర్వహించారు. గ్రామ పెద్దలతో పాటు ఎమ్మెల్యే శంకరరావు కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు.

సత్తెమ్మతల్లిని దర్శించుకున్న డీఎస్పీ

అచ్చంపేట, ఫిబ్రవరి 28 : మండలంలోని మాదిపాడు అటవీ ప్రాంతంలో ఉన్న సత్తెమ్మ తల్లిని బుధవారం డీఎస్పీ గురునాథ్ బాబు దంపతులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ చైర్మన్ కొరివి వెంకట నరేష్ వీరిని సాదరంగా ఆహ్వానించారు. అమ్మవారికి శేష వస్త్రాలతో పాటు తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు.

వెన్నాదేవిలో కన్నా నాగరాజు ప్రచారం

సత్తెనపల్లి, ఫిబ్రవరి 28 : టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ విజయాన్ని కాంక్షిస్తూ గుంటూరు మాజీ మేయర్ కన్నా నాగరాజు బుధవారం రాత్రి వెన్నాదేవిలో ప్రచారం నిర్వహించారు. టీడీపీ మేనిఫెస్టోలోని పథకాలను పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి ఇంటింటికి వెళ్ళి ప్రజలకు వివరించారు. ఆయన వెంట టీడీపీ నేతలు సోలా నంబి, పచ్చ సుధీర్, బుచ్చిబాబు, గుంటూరు మల్లేశ్వరి, తోట అంబిక, పమిడి రామ దుర్గ, గ్రామానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య నేత రమేష్‌కు నివాళులు

సత్తెనపల్లి, ఫిబ్రవరి 28 : పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, ఆర్యవైశ్య నేత రమేష్ మంగళవారం రాత్రి మృతి చెందటంతో సమాచారం తెలుసుకున్న టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ, టీడీపీ నాయకులు రమేష్ గృహానికి వెళ్ళి ఆయన మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి రమేష్ మరణానికి గల కారణాన్ని అడిగి తెలుసుకున్నారు. బ్రెయిన్ స్ట్రోక్‌తో రమేష్ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు కన్నాకు తెలిపారు. కన్నాతో పాటు మద్ది వెంకటేశ్వరరావు, చౌట శ్రీనివాసరావు, ఆతుకూరి నాగేశ్వరరావు, దివ్వెల శ్రీనివాసరావులతో పాటు పలువురు ఆర్యవైశ్య నేతలు ఉన్నారు. కాగా మంత్రి అంబటి రాంబాబు కూడా రమేష్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

కేవీ పాలెంలో భూములపై డ్రోన్ సర్వే

అచ్చంపేట, ఫిబ్రవరి 28 : మండలంలోని కోగంటివారిపాలెం అగ్రహారం భూములపై బుధవారం అధికారులు డ్రోన్ సర్వే నిర్వహించారు. 1380 ఎకరాలు అగ్రహారం భూములు కావటంతో ఆ గ్రామస్తులకు ఇప్పటి వరకు ఎలాంటి పట్టాలు కాని, పాసు పుస్తకాలు కాని లేవు. ఈ నేపథ్యంలో అగ్రహారం భూములకు పట్టాలు, పాసు పుస్తకాలు ఇచ్చేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. బుధవారం ఈ భూములపై డ్రోన్ సర్వే నిర్వహించారు. డ్రోన్ పైలెట్ ఎస్‌కే ఖాశిం, కో-పైలెట్ విజయలక్ష్మి, తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, సర్వేయర్ టీ శ్రీనివాసరావు, వీఆర్‌వో శేషయ్య, రైతులు సాంబిరెడ్డి పాల్గొన్నారు.

కేజీబీవీలో బాలికలకు అవగాహన కార్యక్రమం

అచ్చంపేట, ఫిబ్రవరి 28 : అచ్చంపేటలోని కస్తూర్బా బాలికల పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలికలకు లింగ వివక్ష, బాల్య వివాహాలు, గుడ్ టచ్.. బ్యాడ్ టచ్ గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్రోసూరు ప్రాజెక్టు సీడీపీవో పీ.స్వర్ణ కుమారి, సూపర్‌వైజర్లు ఎన్.మాణిక్యం, బీ.బాలా త్రిపుర సుందరి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీ రాజకీయాలకు క్రికెటర్ బలి : కన్నా

సత్తెనపల్లి, ఫిబ్రవరి 28 : వైసీపీ క్రీడా రాజకీయాలకు ఆంధ్రా రంజిత్ క్రీడాకారుడు హనుమ విహారిని బలి చేశారని టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజకీయ లబ్ది కోసమే ఆడుదాం ఆంధ్రా క్రీడా సంబరాలు నిర్వహించిన ముఖ్యమంత్రి ఆంధ్రా క్రికెట్‌కు కెప్టెన్‌గా ఉన్న హనుమ విహారిని అవమానపరిచారన్నారు. ప్రభుత్వ అరాచకాలు, రాజకీయ రాక్షస క్రీడలతో రాష్ట్రం గర్వించదగ్గ క్రీడాకారులను సైతం బలి చేస్తున్నారని విమర్శించారు. వైసీపీ నాయకుడి కుమారుడి కోసం హనుమా విహారి లాంటి ఉత్తమ క్రీడాకారుడిని తొలగించటం అన్యాయం అన్నారు. క్రీడాకారుల భవిష్యత్‌తో ప్రభుత్వం చెలగాట మాడుతుందని ఆయన విమర్శించారు.

క్రీడా స్ఫూర్తిని దెబ్బతీస్తున్న వైసీపీ నాయకుల అహం : కొమ్మాలపాటి

పెదకూరపాడు, ఫిబ్రవరి 28 : వైసీపీ నాయకుల అహంతో ఏపీలో క్రీడాకారుల క్రీడా స్ఫూర్తిని దెబ్బతీస్తుందని మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైసీపీ నేతల ఒత్తిళ్ళతో తెలుగు తేజాలు ఎందరో పక్క రాష్ట్రాలకు వెళ్ళి వారి అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నార న్నారు. తనదైన శైలిలో ప్రత్యర్థులకు చుక్కలు చూపించే క్రికెటర్ హనుమ విహారి వైసీపీ నేతల ఒత్తిళ్ళకు బలికావాల్సి వచ్చిందన్నారు. ఆంధ్రా రంజి క్రికెట్ టీమ్ ఓ మంచి ఆటగాడిని వైసీపీ నేతల అహం కారణంగా కోల్పోయిందని, తనకు జరిగిన అన్యాయానికి మనస్థాపం చెందిన విహారి తాను ఆంధ్రా టీమ్‌కు ఆడనని ట్విట్టర్ వేదికగా పోస్టు పెట్టారన్నారు. హనుమా విహారికి మంత్రి రోజా క్షమాపణ చెప్పాలని, తిరిగి కెప్టెన్సీ ఇచ్చి రాష్ట్రాభివృద్ధికి తోడ్పడాలని డిమాండ్ చేశారు.

శ్రీధర్‌కు టిక్కెట్ కేటాయించాలని ఏకగ్రీవ తీర్మానం

అచ్చంపేట, ఫిబ్రవరి 28 : 18 సంవత్సరాలుగా తెలుగుదేశం పార్టీ కొరకు నిరంతరం శ్రమించిన నియోజక వర్గ మాజీ ఎమ్మెల్యే, ఇన్‌చార్జ్ డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్‌కు తెలుగుదేశం పార్టీ టిక్కెట్‌ను కేటాయించాలని మండల నాయకులు బుధవారం ఏకగ్రీవంగా తీర్మానించారు. అచ్చంపేటలోని టీడీపీ పార్టీ కార్యాలయంలో పలువురు నాయకులు మాట్లాడారు. అనేక సంవత్సరాలుగా కంచుకోటగా ఉన్న కాంగ్రెస్ పార్టీని నియోజకవర్గంలో కకా వికలం చేస్తూ తెలుగుదేశం పార్టీ జెండా ఎగుర వేసిన డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్‌కు టిక్కెట్‌ను కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, తాళ్ళూరి లక్ష్మీనారాయణ, జువ్వా రామారావు, వెనిగండ్ల కోటయ్య, ఎస్‌కే కాసుల, రేపూడి తోమాస్, కే వీరాంజనేయులు, గోళ్ళమూడి చందు, నెల్లూరి వెంకటయ్య, యడ్లపల్లి బుచ్చిబాబు, నెల్లూరి శ్రీనివాస్, ఎరగర్ల పెద్దమ్మాయి, కొలగాని కుమారి తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో ఇంకా సమస్యలు ఉన్నాయి : మంత్రి అంబటి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి, ఫిబ్రవరి 28 : పట్టణంలో సమస్యలు ఉన్నాయని, మళ్ళీ అధికారం లోకి వచ్చిన తరువాత సమష్టి కృషితో వాటిని పరిష్కరించుకుందామని మంత్రి అంబటి రాంబాబు అన్నారు. బుధవారం మునిసిపల్ చైర్మన్ చలంచర్ల లక్ష్మీతులసీ అధ్యక్షతన కౌన్సిల్ అత్యవసర సమావేశం జరిగింది. మంత్రి రాంబాబు మాట్లాడుతూ మరికొద్ది రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందని, తాను ఇక్కడి నుంచే పోటీ చేస్తానని, ఎన్నికల అనంతరం కౌన్సిల్ సమావేశంలో పాల్గొంటానన్నారు. 11వ వార్డులో అర్బన్ హెల్త్ క్లినిక్ భవనంలో పనులకు సంబంధించి టెండరు ఆమోదం ఒకే రోజులో చేయటంపై ఆమె సందేహాన్ని వ్యక్తం చేశారు. నరసరావుపేటలో ఇంజనీరింగ్ అధికారులు ఉంటారని, వెంటనే వెళ్ళి అనుమతి తీసుకొని వచ్చామన్నారు. రూ.1.50 లక్షలు విలువైన పనులకు 24వ తేదీ చైర్‌పర్సన్ ర్యాటిఫికేషన్ ఇవ్వటం, 24వ తేదీనే టెండరు కాంట్రాక్టర్‌కు కట్టబెట్టడం పై ఆమె అనుమానాలు వ్యక్తం చేశారు. 6వ వార్డు కౌన్సిలర్ సత్యవాణి మాట్లాడుతూ వార్డులోకి వెళితే ప్రజలు ఛీకొడుతున్నారని, పనులు సక్రమంగా చేయటం లేదని, చేయని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో వైస్ చైర్మన్ నాగుల్ మీరాన్, కోటేశ్వరరావు నాయక్, కౌన్సిలర్లు తురకా మేరీగ్రేస్, లోకా కళ్యాణి, కూకుట్ల లక్ష్మీ, అచ్యుత శివ ప్రసాదు, ఆకుల రమేష్, పెద్దింటి గోవిందమ్మ, రామకృష్ణ, కంభంపాటి అబ్రహం, జానీ బాషా, గుజ్జర్లపూడి సతీష్ తదితరులు పాల్గొన్నారు. ఎజెండాలో పొందు పరిచిన పలు అంశాలను సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశం మొత్తం అంబటి ప్రచార సభలా కొనసాగింది.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

క్రోసూరు, ఫిబ్రవరి 28 : జాతీయ సైన్స్ దినోత్సవం క్రోసూరు మండలంలోని పలు ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో సీవీ రామన్ చిత్రపటానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు సృజనాత్మకతతో తయారు చేసిన సైన్స్ పరికరాలను ప్రదర్శించారు. సెయింట్ ఆన్స్ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో సైన్స్ ఎక్స్‌పో కార్యక్రమం జరిగింది. మొత్తం 120 ప్రాజెక్టులను విద్యార్థులు తయారు చేసినట్టు పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ మేరీ రజిత తెలిపారు. సైన్స్ ఉపాధ్యాయులు లిడియ, సాయిలక్ష్మి, భవానీ పాల్గొన్నారు.

● పెదకూరపాడు, ఫిబ్రవరి 28 : భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి అందుకున్న తొలి భారతీయుడు సీవీ రామన్ అని హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కాకాణి వెంకట రమణ అన్నారు. పెదకూరపాడులోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జరిగిన కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు రాధాకృష్ణ, మురళీధరరావు, కాత్యాయిని, పులి నరేష్‌లు విద్యార్థులకు సైన్స్ క్విజ్ నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ముందుగా ప్రముఖ శాస్త్రవేత్తల చాయచిత్రాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● నకరికల్లు, ఫిబ్రవరి 28 : మండలంలోని చేజర్ల చేజర్ల ఎస్‌వీఎస్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులకు క్విజ్, చిత్రలేఖనం, వక్తృత్వం, వ్యాస రచన పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. సీవీ రామన్ చిత్రపటానికి హెచ్ఎం షేక్ పాహీన్, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్.లలిత, పీ.మల్లిక, షేక్ మస్తాన్‌వలి, గేరా మోహనరావు, ఏసీహెచ్ వెంకటరావు, బత్తుల సుందరరావు, షేక్ హబీబ్, షేక్ గౌస్ పాల్గొన్నారు.

● మాచర్ల రూరల్, ఫిబ్రవరి 28 : పట్టణంలోని చక్రధర్ డిగ్రీ కళాశాలలో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయిమార్కొండారెడ్డి ఆధ్వర్యాన సర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నవీన్‌రెడ్డి, గురవయ్య, జ్యోతి, లక్ష్మీ ప్రసన్న, లక్ష్మీ దుర్గ, రాణి తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఏ శంకరరావు

అమరావతి, ఫిబ్రవరి 28 : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని అమరావతి సందర్శించే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. అమరేశ్వరాలయ ప్రాంగణంలో మహాశివరాత్రి సందర్భంగా డీఏవో మహ్మద్ హుస్సేన్ అధ్యక్షతన బుధవారం జరిగిన సమావేశంలో దేవదాయ శాఖ ఉత్సవ అధికారి పి.సైదమ్మబాయి పాల్గొన్నారు. ఈఓ వేమూరి గోపి మాట్లాడుతూ ఆలయంలో భక్తుల సౌకర్యార్థం క్యూలైన్లు, షామియానాలు, తాగునీరు, ప్రసాదాలు అందుబాటులో ఉంచడం జరుగుతుందన్నారు. సమావేశంలో పంచాయతీ ఈవో నాగరాజు, సీఐ బ్రహ్మం, వైద్య, విద్యుత్, మోటారు తనిఖీ, ఎక్సైజ్ శాఖ, అగ్నిమాపక శాఖ అధికారులు మాట్లాడారు. సమావేశంలో తహసీల్దార్ ఏవీ రమణారావు, ఎంపీడీవో రాణీ, క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, ఉపసర్పంచ్ నిమ్మా విజయసాగరబాబు, జడ్‌పీటీసీ కోఆప్షన్ సభ్యులు షేక్ హష్మీ పాల్గొన్నారు.

రామాపురంలో వైద్య శిబిరం

పెదకూరపాడు, ఫిబ్రవరి 28 : పెదకూరపాడు కాకతీయ డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం ఎన్ఎస్ఎస్ యూనిట్ విద్యార్థులు మండలంలోని రామాపురంలో షుగర్, బీపీలపై సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఏసమ్మ, పాఠశా ల ప్రధానోపాధ్యాయులు జోస్పీనమ్మ, లయన్స్ క్లబ్ ప్రతినిధులు శీలంనేని సాంబశివరావు, కాకతీయ కళాశాల ప్రిన్సిపాల్ అశోక్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఎం.వందనంబాబు, అధ్యాపకులు ఎస్.అశోక్ కృష్ణ పాల్గొన్నారు.